ప్రజాశక్తి

శనివారం 18 జనవరి 2025

8 పేజీలు





విశాఖపట్నం అనకాపల్లి

పట్టుబట్టాలి

- బల్క్ డ్రగ్ పార్కు రద్దుకు తీర్మానం చేయాలి
- నేడు జిల్లా పరిషత్ సమావేశం



జిల్లా పరిషత్ కార్యాలయం

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

శనివారం జరిగే జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో రెండు ప్రధానాంశాలపై చర్చ జరగనుంది. ఈ నెల 8న విశాఖపట్నం నుంచి ప్రధాని నరేంద్ర మోడీ వర్చువల్‌లో అచ్యుతాపురం మండలం పూడిమడక వద్ద ఎన్‌టిపిసి గ్రీన్ హైడ్రోజన్ హబ్, నక్కపల్లి మండలంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు చేసిన శంకుస్థాపనపై ప్రజల్లో నెలకొన్న భయాలు, అనుమానాలపై సభ్యులు ప్రశ్నలు లేవనెత్తనున్నారు. మత్స్యకారులు, ప్రజలు తమ జీవనోపాధిని, ఆరోగ్యాలను దెబ్బతీసే బల్క్ డ్రగ్ పార్కును రద్దు చేయాలని కొంతకాలంగా ఆందోళన చేస్తున్నారు. రాజయ్యపేటలో రాజకీయాలకు అతీతంగా బల్క్ డ్రగ్ పార్కును ప్రజలు వ్యతిరేకిస్తున్నారు. కానీ రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత, ఎంపీ సిఎం రమేష్ మౌనం దాల్చుతున్నారు మత్స్యకారులు, ప్రజల భయాలను తొలగించడంలేదు. ప్రజలు వద్దనుకున్న పని చేయబోమని చెప్పడంలేదు. 2001 ఎకరాల్లో ఏర్పాటు చేయబోయే బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపనకు ముందు చేయాల్సిన చట్టపరమైన ప్రక్రియలేవీ చేపట్టలేదు. పర్యావరణ నిబంధనలు పాటించలేదు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుపై పర్యావరణ ప్రభావ అంచనా నివేదిక (ఇఐఎ) తయారు చేయాల్సివుంది. ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించాల్సివుంది. నీటిపారుదల, అటవీశాఖ, కాలుష్య నియంత్రణ మండలి నుంచి ఎన్ఒసిలు ఇవ్వాల్సివుంది. ఈ పద్ధతులేవీ పాటించ కుండా, ప్రజల అభిప్రాయాలను తీసుకోకుండా వారికి ప్రాథమిక సమాచారం ఇవ్వకుండా బల్క్ డ్రగ్ పార్కుకు శంకుస్థాపన చేయడంపై మత్స్యకారులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

దాదాపు 120 ఎకరాల విస్తీర్ణంలోని హెటిరో డ్రగ్ కంపెనీ సముద్రంలోకి విడిచిపెడుతున్న రసాయన వ్యర్థాలతో మత్స్యకారులు బతుకులు ఇప్పటికే దెబ్బతిన్నాయి. సముద్రంలో చేపల ఉత్పత్తి తగ్గడంతో వేటలేక జీవనోపాధి కోసం వలసలు పోతున్నారు. అటువంటిది 2001 ఎకరాల విస్తీర్ణంలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటైతే తామిక్కడ బతకలేమని, వేట పూర్తిగా పోతుందని, రోగాలపాలవుతామని రాజయ్య పేట సహా పరిసర గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇఐఎ నివేదిక లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించకుండా బల్క్ డ్రగ్ పార్కు శంకుస్థాపన ఎలా చేస్తారన్న స్థానిక మత్స్యకారులు, ప్రజల ప్రశ్నకు పరిశ్రమలు, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల నుంచి సరైన సమాధానం లేదు. కాలుష్య నియంత్రణ మండలి అధికారులు వాస్తవాలు చెప్పకపోవడంతో మత్స్యకారుల్లో మరింత భయం పెరుగుతోంది. ఇది నక్కపల్లి మండలానికే పరిమితమైన సమస్య కాకపోవడంతో తీరప్రాంతంలోని పాయకరావుపేట, ఎస్.రాయవరం, రాంబిల్లి, అచ్యుతాపురం, పరవాడ మండలాల్లోని ప్రజలూ కాలుష్య మిగతా 2లో..



ఉక్కు దీక్షా శిబిరంలో నినదిస్తున్న సిపిఎం నాయకులు

ఉక్కు ప్రైవేటీకరణ విరమించుకోవాలి

- ప్యాకేజీ తాత్కాలిక ఉపశమనం మాత్రమే
- సిపిఎం నాయకులు రాంబాబు, ఈశ్వరమ్మ

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌కు రూ.11,440 కోట్లు ప్యాకేజీ ఇస్తున్నట్లు కేంద్రం ప్రకటించడంతో స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ ఆగినట్టు కాదని సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు, కంచరపాలెం జోన్ కార్యదర్శి బొట్టా ఈశ్వరమ్మ అన్నారు. ప్లాంట్ ప్రయివేటీకరణను నిలిపివేస్తున్నట్టు ప్రధాని మోడీ స్పష్టమైన ప్రకటన చేయాలని డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్, ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ విశాఖ అఖిలపక్ష కార్మిక, ప్రజా సంఘాల జెఎసి ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ వద్ద తలపెట్టిన రిలే దీక్షలు శుక్రవారానికి 1389వ రోజుకు చేరాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ప్యాకేజీ ప్లాంట్‌కు తాత్కాలిక ఉపశమనం మాత్రమేనని, శాశ్వతమైన పరిష్కారం కాదని అన్నారు. ప్లాంట్ ఆర్థికంగా నిలదొక్కుకోవాలంటే సొంత గనులు కేటాయించాలన్నారు. దీనిపై కేంద్రం ఎటువంటి నిర్ణయమూ ప్రకటించలేదన్నారు. సెయిల్‌లో విలీనం చేయడం ద్వారా విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఒక బలమైన సంస్థగా ఎదుగుతుందన్నారు. దీనిపై కూడా కేంద్రం ఎటువంటి నిర్ణయమూ ప్రకటించలేదన్నారు. దీక్షల్లో గొలగాని అప్పారావు, ఎ.నూకేశ్వరరావు, భానుమూర్తి, ఆనంద్, తదితరులు పాల్గొన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి

▶ వార్త 5లో..

మల్టీలెవెల్ కార్ పార్కింగ్ పనుల పరిశీలన

▶ వార్త 2లో..

ఆదర్శమూర్తి.. జ్యోతిబసు

▶ వార్త 8లో..



గవర్నర్ అందించిన ట్రోఫీని కలెక్టర్‌కు ఇస్తున్న సత్యానందం

సాయుధ దళాల పతాక నిధి

విరాళాల సేకరణలో విశాఖకు ప్రథమ స్థానం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సాయుధ దళాల పతాక దినోత్సవ సందర్భాన్ని పురస్కరించుకొని పతాక నిధికి చేపట్టిన విరాళాల సేకరణలో విశాఖపట్నం జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్ పిలుపునందుకొని పలు సంస్థలు, అధికారులు, సామాజిక కార్యకర్తలు స్వచ్ఛందగా ముందుకు వచ్చి రూ.24..48 లక్షల విరాళం అందజేశారు. రాష్ట్రంలో విశాఖపట్నం జిల్లా మిగతా 2లో..

లా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి ధీరజ్ సింగ్ ఠాకూర్

ప్రజాశక్తి - సబ్బవరం : లా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని ఆంధ్రప్రదేశ్ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి, దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయం కులపతి ధీరజ్ సింగ్ ఠాకూర్ ఆదేశించారు. మండలంలోని దామోదరం సంజీవయ్య జాతీయ న్యాయ విశ్వవిద్యాలయాన్ని ఆయన శుక్రవారం సందర్శించారు. విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ డి.సూర్యప్రకాశరావు ఆయనకు ఘన స్వాగతం పలికారు. అనంతరం విశ్వవిద్యాలయ జనరల్ కౌన్సిల్ మీటింగ్ జరిగింది. సుమారు నాలుగు గంటల పాటు విశ్వవిద్యాలయంలో గడిపిన ధీరజ్ సింగ్ ఠాకూర్ వర్సిటీలోని వివిధ విభాగాల పనితీరును సమీక్షించారు. విద్యార్థులతో సంభాషిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం నూతనంగా నిర్మించిన రెండు బాలికల వసతి గృహాలను ప్రారంభించారు. విద్యార్థుల భోజన



విద్యార్థినుల వసతి గృహాలను ప్రారంభిస్తున్న ధీరజ్ సింగ్ ఠాకూర్

సదుపాయాలను సమీక్షించి, వాటిని ఎలా మెరుగుపరచాలో తెలుపుతూ విద్యార్థుల మెస్ కమిటీ పని తీరును తెలుసుకున్నారు. విశ్వవిద్యాలయ అధికారులకు పలు సూచనలు చేశారు. హాస్టల్‌లోని ప్రతి అంతస్తును సందర్శించి బాత్ రూమ్‌లలో మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

పట్టుబట్టాలి

పరిశ్రమల రాకతో తీవ్రమైన ఆందోళనకు గురవుతున్నారు. తీర ప్రాంతంలోని ఈ మండలాలు పాయకరావుపేట, యలమంచిలి, పెందుర్తి నియోజకవర్గాలకు విస్తరించివున్నందున ఆ నియోజకవర్గ ఎమ్మెల్యేలు స్పందించాల్సివుంది. జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ సుభద్ర అధ్యక్షతన శనివారం జరగనున్న జిల్లా పరిషత్ సర్వ సభ్య సమావేశంలో ప్రాతినిధ్య ప్రాంతాలకు, పార్టీలకు అతీతంగా జెడ్‌పిటిసిలు, ఎంపిపిలు బల్క్ డ్రగ్ పార్కు రద్దుపై జిల్లా పరిషత్‌లో తీర్మానం చేసి ప్రజల ఆకాంక్షలు, అభిప్రాయాలను గౌరవించాలి.

నేడు 2025-26 బడ్జెట్

జిల్లా పరిషత్ 2024–25 సవరణ బడ్జెట్, 2025–26 సంవత్సర అంచనా బడ్జెట్ శనివారం జిల్లా పరిషత్ సమావేశంలో ప్రవేశపెట్టన్నారు. దీనికి ముందు స్థాయీ సంఘం ఆమోదం పొందనుంది. బడ్జెట్ ఆమోద అనంతరం జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో వ్యవసాయ, విద్య, సంక్షేమ శాఖలపై సమీక్షపై చర్చ జరగనుంది.

పూర్తి నివేదికలతో రండి

- జెడ్‌పి సిఇఒ నారాయణమూర్తి

విశాఖ కలెక్టరేట్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఛైర్‌పర్సన్ జల్లిపల్లి సుభద్ర అధ్యక్షతన శనివారం జెడ్‌పి సమావేశ మందిరంలో జరగనుందని, ఈ మేరకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి పి.నారాయణమూర్తి తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లాలోని అన్ని విభాగాల అధికారులు పూర్తి నివేదికలతో హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. సర్వసభ్య సమావేశం ఉదయం 10.30 గంటల నుంచి సమావేశ మందిరం వేదికగా కొనసాగుతుందని, సభ్యులు, అధికారులు భాగస్వామ్యమై విజయవంతం చేయాలని కోరారు. అలాగే ఉదయం 9 నుంచి 10.30 గంటల వరకు జెడ్‌పి స్థాయీ సంఘ సమావేశాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. జెడ్‌పి ఛైర్‌పర్సన్ జె.సుభద్ర అధ్యక్షతన ఆమె ఛాంబర్ సమీపంలోని విసి. హాలులో, జెడ్‌పి సమావేశ మందిరంలో ఒకటి నుంచి ఏడు వరకుగల స్థాయీ సంఘ సమావేశాలు వేర్వేరుగా ఉదయం నుంచి నిర్దేశిత సమయాల్లో జరుగుతాయని చెప్పారు. ప్రాదేశిక నియోజకవర్గ సభ్యులు, ఎంపిపిలు, అధికారులు సమావేశాలకు హాజరుకావాలని కోరారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న ధీరజ్ సింగ్ ఠాకూర్

లా విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు

ఆధునిక ఫిట్టింగ్స్, వాషింగ్ మెషిన్, డ్రైయర్ లాంటి సదుపాయాలు కల్పించాలని ఆదేశించారు. విద్యార్థులు తమకు కల్పించిన సౌకర్యాలను సక్రమంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యార్థుల క్రీడా సౌకర్యాలను పరిశీలించి, అక్కడ నిర్మిస్తున్న ఇండోర్ ఆడిటోరియంను సందర్శించారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయమూర్తి ఎన్.జయసూర్య, విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ విశ్వచంద్రనాథ్ మాదాసు, చీఫ్ వార్డెన్లు భాగ్యలక్ష్మి, జోగినాయుడు, నాగేశ్వరరావు, షేర్లి తదితరులు పాల్గొన్నారు.

విరాళాల సేకరణలో విశాఖకు ప్రథమ స్థానం

ప్రథమ స్థానంలో నిలవగా రాష్ట్ర గవర్నర్ జిల్లాకు ట్రోఫీ, ధ్రువీకరణ పత్రాన్ని బహుకరించారు. సంబంధిత ట్రోఫీని, పత్రాలను జిల్లా సైనిక సంక్షేమ అధికారి జి.సత్యానందం తన కార్యాలయ సిబ్బందితో కలిసి శుక్రవారం జిల్లా కలెక్టర్‌కు ఆయన ఛాంబర్‌లో అందజేశారు. కార్యక్రమ విశేషాలను వెల్లడించారు. పతాక నిధికి విరాళాలు అందించిన స్వయం సహాయక సంఘాల సభ్యులకు, మాజీ సైనిక సంఘాల సభ్యులకు, జిల్లా పౌరులకు, సామాజిక కార్యకర్తలకు జిల్లా కలెక్టర్ ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా సైనిక సంక్షేమ అధికారిని, ఇతర సిబ్బందిని అభినందించారు.

నేడు ఎన్‌టిఆర్ వర్ధంతిని జయప్రదం చేయాలి

ప్రజాశక్తి-విఆర్.పురం : మాజీ ముఖ్యమంత్రి, టిడిపి వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు 29వ వర్ధంతి కార్యక్రమం మండలంలోని రేఖపల్లి జంక్షన్లో శనివారం ఉదయం 9 గంటలకు నిర్వహిస్తున్నట్లు టిడిపి మండల కార్యదర్శి బురక కన్నారావు శుక్రవారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి నివాళులర్పించనున్నట్టు పేర్కొన్నారు. టిడిపి కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

మల్టీలెవెల్ కార్ పార్కింగ్ పనుల పరిశీలన

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ అత్యంత ప్రతిష్టాత్మకంగా రూ.80 కోట్ల నిధులతో సిరిపురం జంక్షన్‌లో నిర్మిస్తున్న మల్టీలెవెల్ కార్ పార్కింగ్ కమర్షియల్ కాంప్లెక్స్ నిర్మాణ పనులను మెట్రోపాలిటన్ కమిషనర్ కెఎస్.విశ్వనాథన్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా అయన అసంపూర్తిగా ఉన్న పనులను గుర్తించి ఎక్కువ మంది కార్మికులను నియమించుకుని, అన్ని పనులనూ జనవరి నెలాఖరుకు పూర్తి చేసి ఫిబ్రవరి మొదటి వారంలో ప్రారంభోత్సవానికి సిద్ధం చెయ్యాలని అధికారులను, గుత్తేదారు సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. అంతేకాకుండా సోమవారం మరొకసారి పెండింగ్ పనులపై సమీక్ష నిర్వహిస్తానని తెలిపారు.

క్షేత్ర స్థాయి పర్యటనలో ప్రధాన ఇంజినీర్ భవానీ శంకర్, సూపరింటెండింగ్ ఇంజినీర్ బలరామరాజు, కార్యనిర్వాహక ఇంజినీర్లు మధుసూదన్, రామరాజు, గుత్తేదారు సంస్థ ప్రతినిధులు కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఉక్కు ప్యాకేజీపై గంటా హర్షం

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం రూ.11440 కోట్లు ప్యాకేజీని ప్రకటించడంపై భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు హర్షం వ్యక్తం చేశారు. అప్పట్లో తాను ప్లాంట్ కోసం చేసిన రాజీనామా నిర్ణయానికి సార్థకత లభించిందని తెలిపారు. ఎంవిపి.కాలనీలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ విశాఖ స్టీల్‌ప్లాంట్ ఆంధ్రుల ఆత్మ గౌరవానికి ప్రతీకని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం ఉక్కు పరిశ్రమను పరిరక్షించేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రైవేటీకరణ ప్రతిపాదన రాగానే అప్రమత్తమై పోరాటాన్ని సాగించిన కార్మిక, ఉద్యోగ సంఘాలకు గంటా అభినందనలు తెలిపారు. ఆంధ్రుల హక్కుగా సాధించుకున్న స్టీల్ ప్లాంట్‌ను రక్షించుకోవడానికి అయిదేళ్ల కాలంలో జగన్మోహన్ రెడ్డి చేసింది శూన్యమని ఆయన విమర్శించారు. మీడియా సమావేశం అనంతరం కూటమి నాయకులతో కలిసి గంటా బాణసంచా కాల్చారు. కార్పొరేటర్లు పివి.నరసింహం, లొడగల అప్పారావు, భీమిలి జెడ్‌పిటిసి గాడు వెంకటప్పడు, కూటమి నాయకులు కె.రామానాయుడు, శాఖారి శ్రీనివాస్, డిఎఎన్.రాజు, కోరాడ రమణ, దామోదరరావు, గంటా నూకరాజు, బిఆర్‌బి.నాయుడు, తాత్రాజు అప్పారావు, మొల్లి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న గంటా శ్రీనివాసరావు

టిడిపి శ్రేణుల సంబరాలు

విశాఖ కలెక్టరేట్ : స్టీల్‌ప్లాంట్‌కు కేంద్రం ప్యాకేజీ ప్రకటించడం పట్ల హర్షం వ్యక్తపరుస్తూ టిడిపి జిల్లా కార్యాలయంలో శుక్రవారం పార్టీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. ఈ సందర్భంగా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ దక్షిణ నియోజకవర్గ ఇన్‌ఛార్జి, రాష్ట్ర ఎన్టీఆర్ వైద్యశాల ఛైర్మన్ సీతంరాజు సుధాకర్ మాట్లాడారు. సమావేశంలో కార్పొరేటర్లు విల్లూరి భాస్కరరావు, ఉరుకూటి నారాయణరావు, టిడిపి వార్డు అధ్యక్షులు బంటుపల్లి సూర్యనారాయణ పాల్గొన్నారు.

గోపాలపట్నం : స్టీల్‌ప్లాంట్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు కృషితోనే కేంద్ర ప్రభుత్వం రూ.11,440 కోట్లు కేటాయించిందని విశాఖ పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పి.గణబాబు అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కొందరు స్టీల్‌ప్లాంట్ కార్మికులు ఆయనను కలిసి, నిధుల కేటాయింపులపై హర్షం వ్యక్తం చేస్తూ గణబాబుకు స్వీట్ తినిపించి కృతజ్ఞతలు తెలిపారు.

కార్యక్రమంలో టిడిపి వార్డు కార్పొరేటర్లు దాడి వెంకట రమేష్, బొమ్మిడి రమణ విశాఖ స్టీల్‌ప్లాంట్ కార్మికులు బంగారు తులసిరామ్, గొర్లె నరసింగరావు, రమణ, మొక్క అప్పారావు, సాలపు రమణ జిఎంనాయుడు, కూటమి పార్టీల నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

'జివిఎంసిలో లోడర్ కాంట్రాక్టర్ దోపిడీ'

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : జివిఎంసిలో లోడర్ కాంట్రాక్టర్ పెద్ద ఎత్తున దోపిడీకి పాల్పడుతున్నారని, దీనిని అరికట్టవలసిన అధికారుల చోద్యం చూస్తున్నారని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) గౌరవ అధ్యక్షులు పి.వెంకట రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కాంట్రాక్టర్ దోపిడీకి అంతు లేకపోవడం వల్లనే కార్మికులు ఆందోళనలు చేస్తున్నారన్నారు. లోడర్స్ లేబర్ కాంట్రాక్టు ఒప్పందం చెల్లదని తెలిపారు. పిఎఫ్, ఇఎస్ఐ లేకుండా ఈ కాంట్రాక్టును కౌన్సిల్ ఎలా ఆమోదించిందని ప్రశ్నించారు. రూ.450 రోజు వేతనం ఏ జివో ప్రకారం నిర్ణయించారని అడిగారు. మున్సిపల్ సర్క్యులర్లు ఏం చెప్తున్నాయో గమనించారా ? అని ప్రశ్నించారు. జివిఎంసిలో టెండర్ విధానం అత్యంత లోపభూయిష్టంగా ఉందన్నారు. దోపిడీ క్రమాన్ని ఆయన వివరించారు. ఈ లూటీ వ్యవహారంపై విచారణకు డిమాండ్ చేశారు. రికార్డులను తనిఖీ చేసి, నార్కోటిక్ టెస్ట్ చేస్తే బండారం బయటపడుతుందని తెలిపారు. దీనికి జివిఎంసి పాలకవర్గం, అధికారులు సిద్ధమా ? అని ప్రశ్నించారు.

మలేరియా నిర్మూలనకు ముందస్తు చర్యలు

రంపచోడవరం : ఏజెన్సీలోని పూర్తిస్థాయిలో మలేరియా నిర్మూలించే విధంగా ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి కట్టా సింహాచలం పేర్కొన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల వైద్యాధికారులు, సబ్ యూనిట్ అధికారులు, ఏఎంఓ, గ్రామ సచివాలయాల ఎఎన్ఎంతో మలేరియా నిర్మూలనపై శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశ మందిరంలో పిఒ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సంవత్సరం మలేరియా పూర్తిస్థాయిలో నిర్మూలించే విధంగా ప్రతి గ్రామంలో ముందస్తు యాక్షన్ ప్లాన్ తయారు చేసి సమర్పించాలని ఆదేశించారు. ఫీవర్ కేసులు సంభవించకుండా ఎప్పటికప్పుడు డోర్ టు డోర్ సర్వే చేయాలని సూచించారు. పిహెచ్‌సిల నుండి రంపచోడవరం, కాకినాడ, రాజమండ్రి రిఫరల్ కేసులు సంబంధిత ఎఎన్ఎంలు ఎప్పటికప్పుడు ఫాలోఅప్ చేయాలన్నారు



స్టడీ టూర్‌లో పాల్గొన్న ట్రైనీ ఐఎఎస్‌లు

ముగిసిన వింటర్ స్టడీ టూర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాఖండ్ రాష్ట్రం ముస్సోరిలోని లాల్ బహదూర్ శాస్త్రి నేషనల్ అకాడమీ ఆఫ్ అడ్మినిస్ట్రేషన్‌కు చెందిన 2024 బ్యాచ్‌లోని 38 మంది ట్రైనీ ఐఎఎస్ అధికారులు ఈ నెల 9 నుంచి రెండు బృందాలుగా తూర్పు నౌకాదళ కమాండ్‌లో చేపట్టిన వింటర్ స్టడీ టూర్ ముగిసింది. వారంతా నావికాదళ కార్యకలాపాలను పరిశీలించారు. భారత నావికాదళం ఆపరేషనల్ కమాండ్ల పాత్రలను, బాధ్యతలను అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా ఇక్కడి అధికారులు ఇండియన్ నేవీలో ఈస్టర్న్ నేవల్ కమాండ్ పాత్ర, బాధ్యతలపై శిక్షణార్థులకు ఇంటరాక్టివ్ ప్రజెంటేషన్ ఇచ్చారు.

దుర్గంధం ముప్పేట దాడి!

- డంపింగ్‌యార్డు, గంగవరం పోర్టు కాలుష్యంతో అవస్థలు
- పూడుకుపోయిన గెడ్డతో మూడింతలైన కష్టాలు
- అవస్థలు పడుతున్న రామచంద్రనగర్ జనం
- పట్టించుకోని పాలకులు, అధికారులు



రామచంద్రనగర్ గెడ్డలో పేరుకుపోయిన పిచ్చి మొక్కలు

ప్రజాశక్తి - గాజువాక :జివిఎంసి 76వ వార్డు పరిధి రామచంద్రనగర్ గ్రామానికి అనుకొని ఉన్న గెడ్డ తుప్పలు, ముళ్లపొదలు, వ్యర్థాలతో పూడుకుపోయింది. కొన్నాళ్లుగా పూర్తిస్థాయిలో పూడికలు తొలగించని పరిస్థితుల్లో దుర్గంధభరితంగా మారి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తోందని స్థానికులు వాపోతున్నారు. ఎస్‌టి కాలనీ వరకు మాత్రమే పూడికలు తీసి, మిగతాది వదిలేశారు.దీంతో చిన్నపాటి వర్షం కురిసినా కాలనీలోకి నీరు చేరుతోందని స్థానికులు వాపోతున్నారు. అంతేకాక పూడికలు తీయకపోవడతో గెడ్డలో నీరు నిల్వ ఉండి దుర్వాసన అదరగొడుతోందని అంటున్నారు.

రామచంద్రనగర్‌లో ఒకపక్కన డంపింగ్ యార్డుతో ఇప్పటికే ప్రజలు ఇబ్బందులు పడుతుండగా, మరోవైపు గంగవరం పోర్టు కాలుష్యం ఇప్పటికే రామచంద్రనగర్, స్వతంత్ర నగర్, గాంధీనగర్, ఎస్‌టి కాలనీ, బర్మా కాలనీ, విశాఖ డెయిరీ కాలనీతోపాటు పలు ప్రాంతాల వాసులను ఇప్పటికే ఇబ్బందులకు గురిచేస్తోంది. దీనికి తోడుగా ఇపుడు గెడ్డలోని దుర్గంధభరిత పరిస్థితులు ప్రజలను అవస్థల పాల్జేస్తూ, రోగాలబారిన పడేలా చేస్తున్నాయని స్థానికులు అంటున్నారు . ఈ ప్రాంతంలో సొంతిల్లు నిర్మించుకున్నవారంతా ఇళ్లను, గ్రామాలను వదిలి వెళ్లలేక ఇక్కడే ఉండి అవస్థలు పడుతున్నారు. కొందరు ఈ బాధలు భరించలేక ఇళ్లను వదిలి, నగరంలోనే ఇతర ప్రాంతాల్లోని అద్దెఇళ్లకు మారి ఉండే దుస్థితి ఉంది. ఇక ఇక్కడ ఇళ్లు ఖాళీగా ఉన్నా, ఏ ఒక్కరూ అద్దెకు వచ్చిన పాపాన పోరని స్థానికులు అంటున్నారు. దీనిపై స్థానిక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ప్రత్యేకదృష్టి సారించి, రామచంద్రనగర్, పరిసర ప్రాంతీయులు దుర్గంధభరిత కష్టాలకు విముక్తి కల్పించాలని కోరుతున్నారు.

ప్రభుత్వం స్పందించాలి



డంపింగ్ యార్డ్, గంగవరం పోర్టు కాలుష్యంతో ఇప్పటికే ఇబ్బందులు పడుతున్నాం. ఇపుడు పూడుకు పోయిన గెడ్డతో కష్టాలు మరింత ఎక్కువయ్యాయి. ప్రభుత్వం స్పందించాలి. సమస్య పరిష్కరించాలి.

వి నారాయణరావు,
రామచంద్ర నగర్ గ్రామ అధ్యక్షులు.

మురుగు సమస్య పరిష్కరించాలి



గ్రామంలో 20ఏళ్ల క్రితం నిర్మించిన డ్రైనేజీలు పాడవ్వడంతో మురుగునీటితో అవస్థలు పడుతున్నాం. దోమలు బెడదతో వ్యాధులు ప్రబలుతున్నాయి. కార్పొరేటర్, జివిఎంసి అధికారులు స్పందించి, చర్యలు చేపట్టాలి.

డి రమణ. రామచంద్రనగర్ గ్రామ కార్యదర్శి.

నేరాలు ఘోరాలు

పేకాట శిబిరంపై దాడి

ప్రజాశక్తి -కొత్తకోట:పేకాట శిబిరంపై దాడి చేసి నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని వారి వద్ద నుంచి రూ 5 వేల 60 రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్టు కొత్తకోట ఎస్సై శ్రీనివాస్ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పి.పొన్నవోలు శివారు జి.ఓడిపల్లి గ్రామ సమీపంలోని తోటల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నట్లు అందిన ముందస్తు సమాచారం మేరకు సిబ్బందితో దాడి చేశామన్నారు. పేకాట ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి చోడవరం కోర్టుకు తరలించామని ఎస్సై తెలిపారు.

ఆసుపత్రిలో అంతర్గత రోడ్ల నిర్మాణం



సిహెచ్‌సిలో అంతర్గత తారురోడ్ల నిర్మాణం

ప్రజాశక్తి -భీమునిపట్నం :స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో అంతర్గత రోడ్ల నిర్మాణం వేగవంతంగా పూర్తయింది. ఎత్తైన ప్రాంతంలో కొత్తగా నిర్మించిన ఇన్‌పేషంట్ల వార్డు కు వెళ్లేందుకు సరైన రహదారి సదుపాయం లేకపోవడంతో పేషంట్లతో పాటు వైద్యులు, సిబ్బంది కొంత అసౌకర్యానికి గురయ్యేవారు.ప్రధాన గేట్ వద్ద నుంచి రెండేళ్ల క్రితం కొత్తగా నిర్మించిన ఇన్ పేషెంట్ల వార్డు భవనం వరకూ రూ 20 లక్షలతో విశాలమైన అంతర్గత తారు రోడ్లు నిర్మించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌పై విద్యార్థులకు శిక్షణ



స్టడీటూర్‌లో పాల్గొన్న కస్తూర్బా విద్యార్థినులు

ప్రజాశక్తి -ఆనందపురం: మండలం, నెల్లేరు గ్రామంలోని కస్తూర్బా విద్యాలయంలోని ఇంటర్ విద్యార్థినులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఫుడ్ ప్రాసెసింగ్‌పై శిక్షణ, స్టడీ టూర్ కార్యక్రమం నిర్వహించారు. గర్ల్ చైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి ఖలీషాబేగం, కళాశాల ప్రిన్సిపాల్ లావణ్య ఆధ్వర్యంలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులను ఆనందపురం మండలం వేములవలస జంక్షన్‌లోని బాలాజీ స్వీట్స్ , బేకరీకి తీసుకువెళ్లి రొట్టె, కుకీస్, కేకులు, పేస్ట్రీ తయారీపై శిక్షణ, మెళకువలను నేర్పించారు..ఫుడ్ ప్రాసెసింగ్ వృత్తి ఉపాధ్యాయ స్వరాజ్యలక్ష్మి రొట్టె కేకులు ఎలా తయారుచేస్తున్నారో విద్యార్థినులకు వివరించారు. ఫుడ్ ప్రాసెసింగ్ శిక్షణ ద్వారా విద్యార్థినులు స్వయం ఉపాధికి అవకాశం ఉంటుందన్నారు.

20 నుంచి పశు ఆరోగ్య శిబిరాలు

ప్రజాశక్తి-అనకాపల్లి, కశింకోట, సబ్బవరం:ఈ నెల 20 నుంచి 31వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నట్టు అనకాపల్లి ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ బి.సౌజన్య, సబ్బవరం పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ కె.ఉషాకుమారి శుక్రవారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు.

పశువులకు, దూడ పెయ్యిలకు, గొర్రెలు మేకలకు నట్టల నివారణ మందులు, గొర్రెలు మేకలు, కోళ్లకు టీకా మందులు వేయడం జరుగుతుందని పేర్కొన్నారు. అనారోగ్యంతో ఉన్న ఎదకు రాని, గర్భకోశ వ్యాధులు ఉన్న పశువులకు ఉచిత చికిత్సలు అందిస్తామన్నారు. ప్రతి మండలంలో రోజుకు రెండు గ్రామాలు చొప్పున ఈ పశు ఆరోగ్య శిబిరాలు ఉంటాయని, రైతులు ఈ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

ప్రజాశక్తి-యలమంచిలి : మండలంలోని జి.కోడూరు హైస్కూల్లో 2010 టెన్త్ బ్యాచ్ విద్యార్థులు శుక్రవారం మెదుకొండమ్మ గుడి ప్రాంగణంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేసుకున్నారు. ఆ పాఠశాల పూర్వ విద్యార్థి అయిన టిడిపి యలమంచిలి మండల అధ్యక్షులు పొలమరశెట్టి నూకరత్నం, అదే బ్యాచ్‌కు చెందిన జనసేన పార్టీ నాయకుడు శేషు ఇందులో పాల్గొన్నారు. రాజకీయాల్లో రాణిస్తున్నందుకు నూకరత్నంను అభినందించారు. విదేశాల్లో చదువుకొని ఉద్యోగం చేస్తున్న వారూ భవిష్యత్తులో గ్రామానికి ఏదైనా మంచిపని తలపెడితే తమ వంతు సహకారం అందిస్తామని ప్రతిపాదించారు.

గెడ్డల్లోని నీరు కాలుష్యభరితం!

- పరిశ్రమల రసాయనాలు, వ్యర్థాలతో ఈ దుస్థితి
- ప్రమాదభరితంగా ఉన్నా పట్టించుకోని అధికారులు



కాపులుప్పాడ వంతెన వద్ద తెల్లటి నురగలా ప్రవహిస్తున్న నీరు

ప్రజాశక్తి - భీమునిపట్నం : రొయ్యల పరిశ్రమలు, ఐస్‌ప్లాంట్, ఫ్లేడ్ తది తర కంపెనీల నుంచి వెలువడుతున్న రసాయనాలు, వ్యర్థాలు కలుస్తుండడం వల్ల గంభీరం గెడ్డకు అనుసంధానంగా ఉన్న కాలువలు, గెడ్డల్లోని నీరు కలుషితమౌతాందోని స్థానికులు ఆరోపిస్తున్నారు. కాలుష్య కారక నీటి ప్రవాహంతో ఆయా గెడ్డల్లోని చేపలు మృత్యువాత పడడంతోపాటు ఈ నీటిని తాగుతున్న మూగజీవాలు అనారోగ్యం బారిన పడుతుండగా, గెడ్డల పరివాహక ప్రాంతాల్లో వ్యాధులు ప్రబలుతాయని స్థానికులు ఆవేదన చెందుతున్నారు. గంభీరం గెడ్డకు అనుసంధానంగా ఉన్న జివిఎంసి 4వ వార్డు కాపులుప్పాడ వద్ద గెడ్డలో నీరు కలుషితమైపోయింది. ఇక్కడ చిన్న పాటి వంతెన మీదుగా ప్రవహిస్తున్న నీరు తెల్లని పాలనురగను తలపించే రసాయనాలతో నిండి ఉండడంతో ప్రజలు భీతిల్లుతున్నారు. మారికవలస కొండలోని చిట్టిగెడ్డ ద్వారా ఈ నీరు ప్రవహిస్తున్నట్లు స్థానికులు తెలిపారు. గుడిలోవ కొండల నుంచి వచ్చే నీరు కాపులుప్పాడ వంతెన మీదుగా వచ్చి గంభీరం గెడ్డలో కలుస్తుందని స్థానికులు చెబుతున్నారు. చిట్టిగెడ్డ, గంభీరం గెడ్డలు కలిసే ప్రాంతంలో నీరు తెల్లగా నురగలు కక్కుతోంది. ఈ నీరు రసాయనాలతో కూడిన వాసన వస్తుందని, పశు వులు, పక్షులు ఈ నీటిని తాగి రోగాల బారినపడుతున్నాయని స్థానికులు అంటున్నారు. గెడ్డలోని చేపలు కూడా మత్స్య వాత పడుతున్నట్లు చెబుతున్నారు. గెడ్డల్లోని నీరు కలుషితమౌతూ ప్రమాదభరితంగా మారుతున్నా దీనిపై సంబంధిత అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరించడంపై విమర్శలు వినిపిస్తున్నారు. ప్రజల ప్రాణాలకు, పర్యావరణానికి ముప్పుగా పరిణమిస్తున్న గెడ్డల్లోని నీటి కాలుష్యంపై ఇప్పటికైనా సంబంధిత అధికారులు తగు చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి -మధురవాడ: ఎన్నో ఏళ్లుగా కనీస మౌలిక సదుపాయాలుకు నోచుకోని గాంధీనగర్ కాలనీలో రూ.20 లక్షల వ్యయంతో రోడ్లు, కాలువల నిర్మాణ పనులకు శుక్రవారం స్థానిక కార్పొరేటర్ మొల్లి హేమలత శంకుస్థాపన చేశారు. మారికవలసలో రూ.13 లక్షలతో రోడ్లు, కాలువలు నిర్మాణం చేపడతామన్నారు. మారికవలస నుంచి ఓజోన్ వేలీ కాలనీకి వెళ్లే మార్గంలో కల్వర్టు నిర్మించాల్సి ఉందని, తొందరలోనే పూర్తి చేస్తామన్నారు.

ఇంకా వార్డులో చాలాచోట్ల రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉందని, దశలవారీగా అన్నీ పూర్తి చేస్తామన్నారు. కార్యక్రమంలో బిసి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొల్లి లక్ష్మణరావు, పార్లమెంటరీ ఉపాధ్యక్షులు వాండ్రాసి అప్పలరాజు, బోయ వెంకటరమణ, మన్యాల సోంబాబు, నమ్మి శ్రీను, ముచ్చి రామనాయుడు, జనసేన అధ్యక్షులు దేవర శివ, ఈగల రవికుమార్,కాలనీ మహిళలు, నాయకులు పాల్గొన్నారు.

రూ.1.10 కోట్లతో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని పలు గ్రామాల్లో రూ.కోటి పది లక్షలతో పలు అభివృద్ధి పనులు చేస్తున్నట్లు పద్మనాభం మండల జనసేన పార్టీ అధ్యక్షులు కురుమల రామస్వామి నాయుడు తెలిపారు. శుక్రవారం తన నివాసం వద్ద విలేకర్లతో మాట్లాడుతూ, మొదట విడతగా రూ.45 లక్షలతో గుడ్డివలస, అగ్రహారం, కొవ్వాడ గ్రామాల్లో శ్మశానవాటికల్లో సిసి రోడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.. అనంతవరం గ్రామంలో రింగ్ రోడ్డు నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు.

వీటిల్లో భీమిలి జనసేన ఇన్‌ఛార్జి పంచకర్ల సందీప్ శంకుస్థాపన చేసిన గుడ్డివలస, అగ్రహారం గ్రామాల్లో సిసి రోడ్ల నిర్మాణాలు పూర్తయ్యాయన్నారు. రెండో విడతగా రూ.70 లక్షలతో మరిన్ని పనులకు ప్రతిపాదనలు చేశామన్నారు. వీటిలో ఐనాడ గ్రామపంచాయతీలో ఎఎన్‌ఎం సబ్ సెంటర్ నుంచి పిన్నింటి వారి ఇల్లు వరకు, అలాగే. ఆర్అండ్‌బి రోడ్డు నుంచి కురుమన రమణ ఇంటి వరకు, పొట్నూరు, రేవిడి, ఏనుగుల పాలెం గ్రామాల్లో కొన్ని పనులకు మండల ఇంజనీరింగ్ అధికారి వెంకటేశ్వరరావు ప్రతిపాదనలు పంపినట్లు తెలిపారు.

తపాలా సేవింగ్స్ ఖాతాల పునరుద్ధరణకు

నేడు, రేపు స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- గాజువాక :మూడేళ్లుగా ఎటువంటి లావాదేవీలు జరగకుండా నిలిచిపోయి ఉన్న తపాలా సేవింగ్స్ ఖాతాల పునరుద్ధరణకు ఈనెల 18,19 తేదీల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు పంతులగారి మేడలో ఉన్న గాజువాక సబ్‌పోస్టాఫీస్ పోస్టుమాస్టర్ పి.తిరుపతిరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీనియర్ సూపరెంటిండెంట్ ఆఫ్ పోస్టల్ ఆదేశాల మేరకు ఈ స్పెషల్‌డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మూడేళ్లుగా ఎటువంటి డిపాజిట్లు, విత్‌డ్రాలు లేకుండా గాజువాక సబ్‌పోస్టాఫీస్ పరిధిలో సుమారు 2050 సేవింగ్స్ పోస్టల్‌ఖాతాలు ఉన్నాయన్నారు. గాజువాకతోపాటు పరిసర చిన, పెదగంట్యాడ, కూర్మన్నపాలెం, అగనంపూడి, శ్రీనగర్, తదితర ప్రాంతాలకు చెందిన ఆయా ఖాతాదారులంతా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఇన్నాళ్లుగా నిలిచిపోయిన తమ పోస్టల్ ఖాతాలను యాక్టివ్ చేసుకోవచ్చని ఎస్‌పిఎం తిరుపతిరావు తెలిపారు.

విండ్‌బాల్ టోర్నీ ప్రారంభం



పోటీలను ప్రారంభిస్తున్న టిడిపి నేత జగన్

ప్రజాశక్తి-ఉక్కునగరం : జివిఎంసి 87వ వార్డు అప్పికొండ రామాలయం ప్రాంగణంలో విండ్‌బాల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలను టిడిపి రాష్ట్ర కార్యదర్శి, స్థానిక కార్పొరేటర్ బొండా జగన్నాథం (జగన్) ప్రారంభించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులంతా మంచి క్రీడాస్ఫూర్తితో వ్యవహరించి, ఆటలో ప్రతిభతో రాణించి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఇంత మంచి కార్యక్రమంలో తనను భాగస్వామి చేసిన కమిటీకి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో వార్డు టిడిపి అధ్యక్షులు రాజన్ రాజు, జిల్లా కార్యదర్శి కళ్లేపల్లి శ్రీనివాస్‌వర్మ, గ్రామ పెద్దలు, క్రీడాకారులు, పాల్గొన్నారు.

విశాఖ, కిరండూల్ ప్యాసింజర్‌కు

అదనపు విస్టాడోమ్ కోచ్

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : పండుగ సీజన్‌లో వెయిటింగ్ లిస్ట్‌లో ఉన్న ప్రయాణికుల అదనపు రద్దీని క్లియర్ చేయడానికి, ఈస్ట్ కోస్ట్ రైల్వే విశాఖ, కిరండూల్ ప్యాసింజర్‌కు అదనపు విస్టాడోమ్ కోచ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ఈ క్రమంలో 58501 విశాఖపట్నం,కిరండుల్ ప్యాసింజర్ రైలుకు ఈనెల 18న ఒక విస్టాడోమ్ చైర్ కార్ కోచ్‌ను , 58502 కిరండుల్ – విశాఖపట్నం ప్యాసింజర్‌కు 19న ఒక విస్టాడోమ్ చైర్ కార్ కోచ్‌ను అదనంగా జతచేయనున్నట్లు తెలిపారు. ఈ సేవలను ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని ఈస్ట్ కోస్ట్ రైల్వే వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ కోరారు.

టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌కు 8 వినతులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ.: జివిఎంసిలో ప్రతి శుక్రవారం నిర్వహిస్తున్న టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్‌లో ఈ వారం ఎనిమిది వినతులు వచ్చాయని జివిఎంసి చీఫ్ సిటీ ప్లానరు ఎ.ప్రభాకరరావు తెలిపారు. శుక్రవారం జివిఎంసి ప్రధాన కార్యాలయం సమావేశ మందిరంలో సిపిలు, డిసిపిలు, ఎసిపిలతో కలిసి ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ సిటీ ప్లానరు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సోమవారం ప్రతిష్టాత్మంగా నిర్వహిస్తున్న పిజిఆర్ఎస్‌లో జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి ప్రజల నుండి అధికంగా ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో, జివిఎంసి పట్టణ ప్రణాళికా విభాగానికి సంబంధించి సమస్యలపై ప్రజల నుండి ఫిర్యాదులు, వినతులను స్వీకరించేదుకు ప్రతిశుక్రవారం ప్రత్యేకంగా టౌన్ ప్లానింగ్ ఓపెన్ ఫోరమ్ నిర్వహిస్తోందన్నారు. ఓపెన్‌ఫోరంలో వచ్చిన అర్జీలను పరిశీలించి, పరిష్కరిస్తామని సిసిపి అన్నారు.

సమస్యల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి

25వ వార్డులో విస్తృతంగా పర్యటించిన జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్



అన్నక్యాంటీన్ సందర్శనలో జివిఎంసి కమిషనర్ సంపత్‌కుమార్

ప్రజాశక్తి- సీతమ్మధార : వార్డుల్లోని సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని జివిఎంసి కమిషనర్ డాక్టర్ పి.సంపత్‌కుమార్ ఆదేశించారు శుక్రవారం మూడవ జోన్ 25వ వార్డు పరిధిలోని అపూర్వ ఆసుపత్రి, కనకమ్మ వారి వీధి, రాజేంద్రనగర్ తదితర ప్రాంతాలలో కార్పొరేటర్ సారిపల్లి గోవిందతో కలిసి విస్తృతంగా పర్యటించారు.

ఈ సందర్భంగా కార్పొరేటర్ గోవింద, అపూర్వ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ ఎన్ఎన్ మూర్తితోపాటు స్థానిక ప్రజలు వార్డులోని పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా అపూర్వ ఆసుపత్రి ఎదురుగా ఉన్న ఖాళీ ప్రదేశాన్ని ప్రజల ఆహ్లాదం కొరకు పార్కుగా అభివృద్ధి పరచాలని, తాము స్వచ్ఛందంగా సహకరిస్తామని స్థానిక ప్రజలు కమిషనర్‌కు విన్నవించారు. దీనిపై కమిషనర్ స్పందిస్తూ, పార్కు ఏర్పాటుకు పూర్తి వివరాలతో నివేదికను అందించాలని జోనల్ కమిషనర్ కె.శివప్రసాద్‌ను ఆదేశించారు. అపూర్వ ఆసుపత్రి వద్ద ఉన్న ఖాళీ ప్రదేశంలో పేరుకుపోయిన వ్యర్థాలను తక్షణమే తొలగించేలా చర్యలుచేపట్టాలని ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్‌ను ఆదేశించారు. కనకమ్మ వారి వీధిలోని సులభ్ కాంప్లెక్స్‌ను పరిశీలించి, రోజువారీ ఎంతమంది వినియోగిస్తున్నారో ఆరా తీశారు. సులభ్ కాంప్లెక్స్‌కు మరమ్మత్తులు చేపట్టి, అవసరమైన మౌళిక వసతులను కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాజేంద్రనగర్ రెల్లి వీధి నుంచి బుల్లయ్య కాలేజ్ ప్రధాన రహదారికి అనుసంధానం చేయాలని కార్పొరేటర్ సారిపల్లి గోవింద కోరగా, ఈ రోడ్డు వైద్యఆరోగ్యశాఖ పరిధిలో ఉన్నందున రోడ్డు విస్తరణకు వారికి లేఖను పంపాలని జోనల్ కమిషనర్‌ను ఆదేశించారు. సమీపంలో ఉన్న అన్నా క్యాంటీన్‌ను సందర్శించి నిత్యం ఎంతమంది పేదలు భోజనం చేస్తున్నారని ఆరా తీశారు. పక్కనే ప్రాంతీయ నేత్ర ఆసుపత్రి ఉన్నందున రోజుకు 400 మంది అన్నా క్యాంటీన్‌ను వినియోగించుకుంటున్నారని నిర్వాహకులు వివరించగా, వృద్ధులు, వైద్యానికి వచ్చే రోగులకు ఇబ్బందులు లేకుండా అన్నాక్యాంటీన్ వద్ద ప్రత్యేక క్యూ లైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అనంతరం వార్డులో పారిశుధ్య పనులు సరిగా నిర్వహించటం లేదని శానిటరీ ఇన్‌స్పెక్టర్ సన్యాసినాయుడుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పర్యటనలో జివిఎంసి అసిస్టెంట్ సిటీ ప్లానర్ మధు సూధనరావు, ఎఎంఒహెచ్ బి.ప్రసాద్‌రావు, ఇంజినీరింగ్ అధికారులు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

కిదాంబి శ్రీకాంత్‌తో హండ్రెడ్ స్పోర్ట్స్ ఎంఒయు



జెర్సీ చూపుతున్న కిదాంబి శ్రీకాంత్, హండ్రెడ్ స్పోర్ట్స్ విశాల్

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : అంతర్జాతీయ వేదికగా ప్రముఖ స్పోర్ట్స్ బ్రాండ్‌గా ప్రసిద్ధి చెందిన హండ్రెడ్ స్పోర్ట్స్ వరల్డ్ బ్యాడ్మింటన్ లెజెండ్, పద్మశ్రీ శ్రీకాంత్ కిదాంబితో తమ భాగస్వామ్యాన్ని ప్రకటించింది. శుక్రవారం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో హండ్రెడ్ స్పోర్ట్స్ సంస్థతో శ్రీకాంత్ కిదాంబి ఒప్పందాన్ని ప్రకటించారు.

ఈ సందర్భంగా మాట్లాడుతూ భారత బ్యాడ్మింటన్ మార్కెట్‌లో తమ బ్రాండ్ ఉనికిని బలోపేతం చేయాలనే లక్ష్యంలో భాగంగా హండ్రెడ్‌తో సహకారం భాగస్వామ్యం కీలకమైన అడుగుగా మారనుందన్నారు. ఈ భాగస్వామ్యం ప్రతిష్టాత్మక ఇండోనేషియా మాస్టర్స్ 2025లో అధికారికంగా ప్రారంభమౌతుందని, ఇది భావితరం ఔత్సాహిక బ్యాడ్మింటన్ క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తుందన్నారు. దేశంలో క్రికెట్ తర్వాత పాపులారిటీలో ఉన్న బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి, యువ ప్రతిభను పెంపొందించడానికి సహకరిస్తుందని అన్నారు. హండ్రెడ్ ఇండియా డైరెక్టర్ విశాల్ జైన్ మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా బ్యాడ్మింటన్ మూలాలను మరింత ముందుకు తీసుకెళ్లాలననే ఉద్దేశ్యం లో శ్రీకాంత్‌తో ఈ ఒప్పందం చేసుకున్నామన్నారు. భారతదేశంలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి దోహదపడుతుందన్నారు.

రాయల చరిత్ర నేటి పాలకులకు ఆదర్శనీయం



కృష్ణదేవరాయలుకు నివాళులర్పిస్తున్న నేతలు

ప్రజాశక్తి -గోపాలపట్నం: విజయనగర సామ్రాజ్య చక్రవర్తిగా, ఆంధ్రభోజ్యుడిగా, సాహితీ సమరాంగన సార్వభౌమునిగా పేరుగాంచిన శ్రీకృష్ణదేవరాయలు నేటితరం పాలకులకు ఆదర్శనీయమని ఈస్ట్రన్ నేవల్ కమాండ్ కెటిబి అసోసియేషన్ గౌరవాధ్యక్షులు గంట్ల శ్రీనుబాబు, అధ్యక్షులు బత్తుల చిరంజీవి కొనియాడారు. శుక్రవారం ఎన్ఎడి కాకానినగర్‌లోని అసోసియేషన్ భవనంలో శ్రీకృష్ణదేవరాయలు జయంతిని పురస్కరించుకుని ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాయల పరిపాలన నేటికి చరిత్రలో శాశ్వతంగా నిలిచి ఉందన్నారు. నేటి తరం పాలకులకు రాయల చరిత్ర ఆదర్శనీయమన్నారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి విజనగరి భాస్కరరావు, కార్యవర్గ సభ్యులు బిఎస్ నాయుడు, ఎస్. రమణ, సూర్య ప్రకాష్, కె. భాస్కర్ ప్రసాద్, జగదీశ్, గూడం కిరణ్ కుమార్, పలువురు నేవల్ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేత రైజింగ్ స్టార్స్



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి -పద్మనాభం: మండలంలోని అయినాడ నిర్వహించిన గ్రామ పంచాయతీ స్థాయి క్రికెట్ టోర్నీలో రైజింగ్ స్టార్స్ జట్టు విజేతగా నిలిచింది. పంచాయతీ పరిధిలోని పలు గ్రామాలకు చెందిన ఏడు క్రికెట్ జట్లు ఈ పోటీల్లో పాల్గొనగా, ఆదివారం నుండి శు క్రవారం వరకు పోటీలు నిర్వహించారు. శుక్రవారం నిర్వహించిన ఫైనల్‌కు అయినాడకు చెందిన ఒరిజినల్ గ్యాంగ్, రేజింగ్ స్టార్స్ జట్లు చేరగా, తుదిపోరులో ఒరిజినల్ గ్యాంగ్‌పై రైజింగ్‌స్టార్స్ జట్టు గెలుపొంది విజేతగా నిలిచింది. విజేత రైజింగ్ స్టార్స్ జట్టుకు రూ.పదివేల నగదు బహుమతితోపాటు ట్రోఫీని, రన్నరప్ ఒరిజినల్ గ్యాంగ్ జట్టుకు రూ.ఐదు వేలు నగదు బహుమతిని టోర్నీ నిర్వాహకులైన టిడిపినాయకులు కురిమిన అనిల్‌కుమార్. కిషోర్ ప్రదానం చేశారు.

ఎన్‌టిఆర్ వర్ధంతిని జయప్రదం చేయండి

ప్రజాశక్తి -పద్మనాభర్: ఈనెల 18న, శనివారం టిడిపి వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్‌టిఆర్ వర్ధంతిని జయప్రదం చేయాలని మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కోరాడ రమణ కార్యకర్తలకు నాయకులకు పిలుపునిచ్చారు. శనివారం పద్మనాభం మండల కాంప్లెక్స్ సమీపంలోని కంటి హార విగ్రహానికి పూలమాలలు వేసి, శ్రద్ధాంజలి ఘటించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశామన్నారు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు

నేషనల్ సిల్క్ ఎక్స్‌పో ప్రారంభం

20 వరకూ నిర్వహణ



ఎక్స్‌పోలో పెట్టిన చీరలను ప్రదర్శిస్తున్న మహిళ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ :నగర ప్రజలు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్న నేషనల్ సిల్క్ ఎక్స్‌పో - ఎగ్జిబిషన్ కమ్ సేల్ - 2025 హోటల్ గ్రీన్ పార్క్‌లో శు క్రవారం ప్రారంభమైంది. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ ఈనెల 20 వరకు పండుగలు, వేడుకలను ఉత్సాహంగా జరుపుకోవడానికి ప్రదర్శనను అమ్మకాలను పూర్తి స్థాయిలో నిర్వహిస్తున్నామన్నారు. ప్రతిరోజు ఉదయం 11 నుండి రాత్రి 9 గంటలు వరకు ఎక్స్‌పో ఉంటుందని, ప్రవేశం ఉచితంకాగా,. అన్ని డెబిట్, క్రెడిట్ కార్డులు అనుమతిస్తారు.

దేశంలోని వివిధ ప్రాంతాల సంస్కృతి, సంప్రదాయాలు కలబోసిన వివిధ రాష్ట్రాలకు చెందిన మగ్గాల ఉత్పత్తులు అన్నింటిని ఒకే గొడుగు కిందకు చేర్చి, ఎక్స్ పోలో ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. దేశంలోని నేత సంప్రదాయాల చుట్టూ తిరిగి వచ్చిన అనుభూతిని ఇది కలిగిస్తుందన్నారు.దేశవ్యాప్త నేత కార్మికులు వేల రకాల సిల్క్, కాటన్ డిజైన్ వస్త్రాలు, డిజైనర్ బ్లౌజ్‌లు, కుర్తీలు వంటి తమ ఉత్పత్తులను 50 శాతం వరకు తగ్గింపుతో ఒకేచోట విక్రయిస్తున్నట్లు తెలిపారు.

మహారాష్ట్ర నుండి పైథాని సిల్క్ చీరలు, కర్ణాటక బెంగుళూరు సిల్క్, సాఫ్ట్ సిల్క్, కాషిదా సిల్క్ చీరలు, మధ్యప్రదేశ్ చందేరి, మహేశ్వరి సిల్క్ చీరలు, పశ్చిమ బెంగాల్ బలూచారి, జమ్దానీ, టాంగైల్, ఢకాయ్ మాస్లిన్ సిల్క్ చీరలు, లినెన్ శారీ కాంతా వర్క్ స్టిచ్ వస్త్రాలు మొదలైనవి ఎక్స్‌పోలో ఉంటాయన్నారు. ఇవేకాక ఎక్స్‌పోలో చీరలు, దుప్పట్లు,సల్వార్ మెటీరియల్‌లు వివిధ డిజైన్‌లు ఉన్నాయన్నారు.వీటిలో బీహార్‌కు చెందిన టస్సార్, మట్కా,భాగల్పూర్ సిల్క్ చీరలు,గుజరాత్ సాంప్రదాయ బంధిని,కచ్ ఎంబ్రాయిడరీ, పటోలా చీరలు,తమిళనాడు నుండి కంజీవరంతో పాటు ఎంబ్రాయిడరీ సిల్క్ చీరలు,కాశ్మీర్ జమ్ము, తాబీ సిల్క్ చీరలు ఉన్నాయన్నారు.

కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలి

- జెవివి రాష్ట్ర నాయకులు త్రిమూర్తులురెడ్డి
- తాడి గ్రామాన్ని సందర్శించిన జనవిజ్ఞాన వేదిక బృందం

ప్రజాశక్తి-పరవాడ

మండలంలోని ఫార్మా పరిశ్రమలు విడుదల చేసే వ్యర్థ రసాయనాల వల్ల తాడి గ్రామంతో పాటు చుట్టూ ఉన్న గ్రామాల్లో గాలి, నీరు, భూమి కలుషితమై ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర నాయకులు కె.త్రిమూర్తులురెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి కాలుష్య నివారణకు చర్యలు తీసుకోవాలని, తాడి గ్రామాన్ని సురక్షిత ప్రాంతానికి తరలించాలని కోరారు. ఈ మేరకు జనవిజ్ఞాన వేదిక ఉత్తరాంధ్ర జిల్లాలలో చేపట్టిన పర్యావరణ అవగాహన యాత్రలో భాగంగా శుక్రవారం మండలంలోని పెదతాడి, చినతాడి, తాడి కాలనీ, తానాం గ్రామాలను జెవివి అనకాపల్లి జిల్లా బృందం సందర్శించి ప్రజల అభిప్రాయాలు సేకరించింది. తాడి గ్రామంలో మహిళలు తమ గోడును వెల్లబుచ్చారు. విపరీతమైన వాయు, జల, భూ కాలుష్యం వల్ల గర్భిణులు గర్భస్రావం భయంతో ఊర్లలో ఉండటం లేదని స్థానికులు తెలిపారు. చిన్నపిల్లలకు శ్వాసకోస, గుండె సంబంధిత వ్యాధులు వస్తున్నాయని, వైద్యం కోసం లక్షల రూపాయలు ఖర్చు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గేదెలు, ఇతర జీవాలకు పునరుత్పత్తి జరగడం లేదని, పంటలు పండకపోవడంతో వ్యవసాయం పూర్తిగా మానేశామని తెలిపారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఇక్కడ జీవిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా జెవివి నాయకులు త్రిమూర్తులు రెడ్డి మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు పడుతున్న ఇబ్బందులను ప్రభుత్వాలు ఏమాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. తక్షణమే కాలుష్య నివారణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెవివి నాయకులు మారిశెట్టి వెంకట అప్పారావు, బి.రామ్ కుమార్, బి.ఉమామహేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



తాడి కొత్త కాలనీలో స్థానికులతో మాట్లాడుతున్న జెవివి నేతలు

ఇంటర్న్‌షిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సంయుక్త ఆధ్వర్యంలో ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా నైపుణ్య అభివృద్ధి సంస్థ అధికారి డాక్టర్ ఎన్ గోవిందరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం ద్వారా యువతకు ప్రతిష్టాత్మక కంపెనీల్లో పని అనుభవం, నైపుణ్యాభివృద్ధి, ఆర్థిక సహాయం లభిస్తుందని పేర్కొన్నారు. ఇంటర్న్షిప్ చేయడానికి టాప్ 500 కంపెనీలతో ఒప్పందం, 6- 12 నెలల ఇంటర్న్షిప్ (కనీసం 6 నెలలు ప్రాక్టికల్ పని), ఇంటర్న్షిప్‌లో ఎంపికైన వారికి వన్ టైం గ్రాంట్ రూ.6,000, ప్రతి నెలా రూ.4,500, కేంద్ర ప్రభుత్వం నుండి, రూ.500 పరిశ్రమ సిఎస్‌ఆర్ నిధుల ద్వారా ఆర్థిక సహాయం మొత్తం రూ.5000, బీమా పరిరక్షణ వంటివి పొందవచ్చని చెప్పారు. 21 నుంచి 24 సంవత్సరాలు మధ్య వయస్సు ఉండి పది, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత, ఐటీఐ, పాలిటెక్నిక్, బిఎ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బిబిఎ, బి.ఫార్మసీ, బిటెక్ వంటి డిగ్రీలు పూర్తి చేసినవారు, చివరి సెమిస్టర్ చదువుతున్నవారు దీనికి అర్హులని పేర్కొన్నారు. https://pminternship.mca.gov.in/logi లింక్ ద్వారా ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, మరిన్ని వివరాలకు శివ, 9010 793492 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

పంచాయతీల్లో అభివృద్ధి

ప్రజాశక్తి-అనకాపల్లి : వైసిపి ప్రభుత్వంలో పంచాయతీలు 5 సంవత్సరాలు అభివృద్ధికి నోచుకోలేదని, 15వ ఆర్థిక సంఘం నిధులు దారి మళ్లించి గ్రామాలను పూర్తిగా నిర్లక్ష్యానికి గురి చేశారని టిడిపి అనకాపల్లి పార్లమెంట్ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు అన్నారు. శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పంచాయతీలకు నిధులు కేటాయించి అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా గౌరవ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, టిడిపి సీనియర్ నాయకులు పెంటకోట వెంకటరమణ పాల్గొన్నారు.

నేడే వేల్పుల వీధి గౌరీ పరమేశ్వరుల మహోత్సవం

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉత్తరాంధ్రలో ప్రసిద్ధి చెంది, 171 సంవత్సరాల చరిత్ర కలిగిన అనకాపల్లి వేల్పుల వీధి శ్రీగౌరీ పరమేశ్వరుల మహోత్సవం శనివారం అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఉత్సవ కమిటీ చైర్మన్ వాకాడ బాబు తెలిపారు. శనివారం అమ్మవారికి ప్రత్యేక అలంకరణ చేసి రథంపై ఊరేగింపు ఉందని చెప్పారు. భారీ స్టేజ్ ప్రోగ్రాములు, విద్యుత్ అలంకరణతో పాటు అతి భారీ బాణాసంచా హంగామా ఎన్టీఆర్ స్టేడియంలో జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో కార్యదర్శి మద్దాల నూకరాజు, కోశాధికారి వేల్పులగణేష్, ఉత్సవకమిటీ సభ్యులు వేల్పుల వీధి పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.

క్రికెట్ టోర్నీ విజేతలకు బహుమతుల ప్రదానం

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని రైవాడ శ్రీఎరకాలమ్మ తల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు జరిగిన క్రికెట్ టోర్నమెంట్‌లో విజేతలకు మాజీ సర్పంచ్ చల్లా తాతీయులు చేతుల మీదుగా శుక్రవారం నగదు బహుమతులు అందజేశారు. విశాఖ దక్షిణ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ యాదవ్ ఆర్థిక సహాయంతో ఈ పోటీలు నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు.

ఎపిఎఫ్‌పిఎస్‌లో రిసోర్స్ పర్సన్స్‌కు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-అనకాపల్లి : ఎపి ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీలో జిల్లా రిసోర్స్ పర్సన్స్‌గా మహిళలు, పురుషులు, ట్రాన్స్ జెండర్ అభ్యర్థుల నుండి దరఖాస్తులు కోరుతున్నట్టు అనకాపల్లి జిల్లా డిఆర్డిఏ పిడి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీతోపాటు కంప్యూటర్, ఇంటర్నెట్ పరిజ్ఞానం, సొంత స్మార్ట్ ఫోన్ ఉండి ప్రయాణాలు చేసేందుకు ఆసక్తి కలిగి ఉండాలని సూచించారు. అభ్యర్థుల వయస్సు 2024 నవంబర్ 1 నాటికి 21 సంవత్సరాలు నుండి 30 సంవత్సరాల లోపు ఉండాలన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ లేదా సహజ వనరులు అభివృద్ధి రంగంలో అనుభవం ఉన్నవారికి ప్రాధాన్యత కల్పిస్తామని చెప్పారు. అభ్యర్థులకు ఇంటర్వ్యూ, రాత పరీక్ష ఈనెల 27న ఉంటుందని, ఆసక్తి అర్హత గల అభ్యర్థులు ఈనెల 24 లోగా ఆయా మండల సమాఖ్య, వెలుగు కార్యాలయానికి వెళ్లి సంబంధిత క్యూఆర్ కోడ్ ద్వారా తమ పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

సిఎం సహాయ నిధి చెక్కు అందజేత

ప్రజాశక్తి-అనకాపల్లి : మండలంలో రెండు కుటుంబాలకు వైద్య ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన చెక్కులను శుక్రవారం పంపిణీ చేశారు. అనకాపల్లి పట్టణంలో నివాసముంటున్న సరిసా నూకరత్నానికి రూ.1,62,000 చెక్కును, మండలంలోని కేఎన్‌ఆర్ పేట గ్రామానికి చెందిన సురపు తరుణ్ కుమార్‌కు రూ.1,78,500 చెక్కును రింగ్ రోడ్డులో జనసేన పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి భీమరశెట్టి రామకృష్ణ (రాంకీ) చేతుల మీదగా బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.

చోడవరం : బుచ్చయ్యపేట మండలం మంగళాపురం గ్రామానికి చెందిన టిడిపి ముఖ్య కార్యకర్త ధారబోయిన ధనలక్ష్మి రావు ఇటీవల మృతి చెందడంతో, ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి మంజూరైన రూ.50వేలు చెక్కును స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు శుక్రవారం చోడవరం టిడిపి కార్యాలయంలో మృతుని భార్యకు అందించారు. కార్యక్రమంలో మంగళాపురం మాజీ సర్పంచులు అల్లంకి వెంకట అప్పారావు, పత్తి రామారావు, పత్తి పెంటారావు, తుమ్మపాల కనమనాయుడు, కట్టుమూరి బాబురావు, తుమ్మపాల వెంకట్, తిప్పన రమేష్ పాల్గొన్నారు.

సెకీ ఒప్పందాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : విద్యుత్ వినియోగదారులకు భారం కానున్న 'సెకి' ఒప్పందాన్ని ఎలక్ట్రిసిటీ రెగ్యులారిటీ కమిషన్ (ఈఆర్‌సీ) తక్షణం రద్దు చేయాలని ఈఆర్‌సీ రాష్ట్ర సలహా కమిటీ సభ్యులు కాండ్రేగుల వెంకటరమణ డిమాండ్ చేశారు. ఈపీడీసీఎల్ కార్పొరేట్ కార్యాలయంలో శుక్రవారం జరిగిన ఈఆర్‌సీ రాష్ట్ర సలహా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన ఈఆర్‌సీ చైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన విలేఖర్లతో మాట్లాడుతూ 'సెకి'తో పీఎస్‌ఏ కుదిరే నాటికి 'సెకి'- అదానీ మధ్య పీపీఏ లేదని, పీపీఏ లేని 'సెకి'తో పీఎస్‌ఏ ఎలా కుదుర్చుకుంటుందని వెంకటరమణ ప్రశ్నించారు. కశింకోట, చీపురుపల్లి ఆర్ఇసీఎస్‌లను యధావిధిగా ఈపీడీసీఎల్ పర్యవేక్షణలోనే కొనసాగించాలని విజ్ఞప్తి చేశారు. అదనపు విద్యుత్ లోడు వినియోగం నిమిత్తం వినియోగదారుల నుంచి డిస్కంలు డిపాజిట్ వసూలు చేస్తున్నాయని, అయితే అదే రీతిలో ట్రాన్స్‌ఫార్మర్ల సామర్థ్యాన్ని పెంచకపోవడం విచారకరమని పేర్కొన్నారు. వ్యవసాయ విద్యుత్ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన లేదని, గృహాలు, వాణిజ్య సంస్థలు, పరిశ్రమలకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ఖర్చును ప్రజల నుంచి వసూలు చేయబోమని ఈఆర్‌సీ ప్రకటించగా ఆ మొత్తాన్ని ప్రజల నుంచి వసూలు చేస్తామని ఇంధనశాఖ చెబుతుండడంతో వినియోగదారులు అయోమయంలో పడ్డారని, ఇందులో ఏది నిజమో స్పష్టమైన ప్రకటన చేయాలని కోరారు. వ్యవసాయ కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రతిపాదన ఉపసంహరించినట్లు డిస్కంలు ఇచ్చిన ప్రతిపాదనల్లో ఎక్కడా లేకపోవడం ఆశ్చర్యాన్ని కల్గిస్తుందని పేర్కొన్నారు. సీజీఆర్‌ఎఫ్‌లను పటిష్టం చేయాలని, ఫోరం తీర్పులను ప్రజలకు వివరించాలని కోరారు.

లంకెలపాలెంలో రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి- అనకాపల్లి : లంకెలపాలెంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని అఖిల పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం స్థానిక సిపిఐ కార్యాలయంలో ప్రజా రాజకీయ వేదిక కన్వీనర్ కనిశెట్టి సురేష్ బాబు అధ్యక్షతన సమావేశంలో వారు మాట్లాడుతూ లంకెలపాలెం సిగ్నల్ పాయింట్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని, అక్కడ విశాఖ-అనకాపల్లి వచ్చేదారి ఎగువ నుండి దిగువకు ఉండడంతో అదే దారిలో వెనుక నుండి వస్తున్న పెద్ద వాహనాలు చిన్న వాహనాల మీదకు ఎక్కటం మూలంగానే ఈ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. ప్రభుత్వం ప్రజల ప్రాణాలను దృష్టిలో ఉంచుకొని అక్కడ ఫ్లైఓవర్ నిర్మాణం చేయాలని, అప్పటి వరకు రోడ్డును సమాంతరంగా చేయాలని డిమాండ్ చేశారు. ఇటీవల లంకెలపాలెం వద్ద జరిగిన ప్రమాదంలో తీవ్రంగా గాయపడి మెడికోవర్ ఆసుపత్రిలో చావుబ్రతుకుల మధ్య కొట్టుకుంటున్న చిన్నయ్యశెట్టిని ప్రభుత్వం వైద్య ఖర్చులు భరించాలని కోరారు. ఈ సమావేశంలో రైతు స్వరాజ్య వేదిక కన్వీనర్ గాడి బాలు, సిపిఐ నాయకులు రాజాన దొరబాబు, కోరిబిల్లి శంకర్రావు, దేవుడు బాబు, సిపిఎం నాయకుడు కర్రి అప్పారావు, ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ జిల్లా కార్యదర్శి శేఖర్ మంత్రుల సాయి వెంకట లక్ష్మణ్, ఆమ్ ఆద్మీ పార్టీ నాయకుడు కొణతాల హరినాథ్ బాబు పాల్గొన్నారు.

జీడి మద్దతు ధరకు దశల వారీ ఉద్యమం

సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు వెంకన్న

ప్రజాశక్తి-దేవరాపల్లి

జీడీ పంటకు మద్దతు ధర ప్రకటించి ప్రభుత్వమే రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలని కోరుతూ జిల్లా వ్యాప్తంగా దశలవారీగా జీడి రైతులతో కలిసి ఉద్యమం చేపడతామని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న పేర్కొన్నారు. మండలంలోని వాలాబు పంచాయతీ పరిధిలోని జీడి తోటలను స్థానిక గిరిజనులతో కలిసి శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి ఏటా జీడీ పంటకు గిట్టుబాటు ధర ప్రకటించకపోవడంతో రైతులు దళారీల చేతిలో మోసపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 కేజీల జీడీ పిక్కల బస్తా వ్యాపారులు రూ.7000కు మించి కొనుగోలు చేయడం లేదన్నారు. ఒక బస్తా జీడి పిక్కల నుండి 25 కేజీల పప్పు వస్తుందని, కేజీ పప్పు ధర రూ.800 అని, ఈ లెక్కన ఒక బస్తా పిక్కల వల్ల రూ.20 వేలు వస్తుందని తెలిపారు. ఒక బస్తా పిక్కలు ప్రోసెసింగ్‌కు రూ.2000 ఖర్చు అవుతుందని, రైతులు కోరిన విధంగా బస్తా జీడిపిక్కలకు రూ.16వేలు ధర ప్రకటించిన ఇంకా వ్యాపారులకు రూ.2000 మిగులు తుందని పేర్కొన్నారు. దీంతో పాటు జీడి తొక్క, నూక ఇతర ఉప ఉత్పత్తుల నుంచి కూడా వ్యాపారులు ఆదాయం పొందుతున్నారన్నారు. అటు రైతులు, ఇటు వినియోగదారులు దోపిడీకి గురవుతున్నారని తెలిపారు. అందువల్ల ప్రభుత్వమే జీడి పంటను 80 కేజీల బస్తాకు రూ.16 వేలు చొప్పున రైతు సేవా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జీడి రైతులు డి.శంకర్, డి.సోమయ్య, మామిడి దేముడు, సిహెచ్.ఎరకయ్య, సోముల క్రిష్ణ, డి.నారాయణ, పి.అప్పలరాజు, మహిళలు పాల్గొన్నారు.



జీడి తోటలను పరిశీలిస్తున్న సిపిఎం నేత వెంకన్న, రైతులు

ఘనంగా తాతాజీ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రముఖ వ్యాపారవేత్త, శ్రీసిద్ధి లింగేశ్వర స్వామి దేవస్థానం మాజీ చైర్మన్ నుదురుపాటి తాతాజీ జన్మదిన వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక చిన్న వీధిలో ఆయన స్వగృహం వద్ద ప్రజలకు, నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, చీరలు, బట్టలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఏటా తన పుట్టిన రోజున సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ ఏడాది 61 సంవత్సరాల పూర్తి చేసుకున్న సందర్భంగా 61 మంది నిరుపేదలకు నిత్యావసర వస్తువులు, బట్టలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తాతాజీకి కుటుంబ సభ్యులు, స్నేహితులు, పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.



వస్త్రాలు, నిత్యావసరాలు పంపిణీ చేస్తున్న తాతాజీ

రోడ్ల అభివృద్ధికి డిఎంఎఫ్ నిధులు విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మండలంలో క్వారీలు క్రషర్లు ద్వారా రవాణా అవుతున్న భారీ వాహనాలతో అన్ని రోడ్లు శిథిలమయ్యాయని, తక్షణమే జిల్లా మినరల్ ఫండ్ విడుదల చేసి రోడ్లు బాగు చేయాలని ఎంపిటిసీలు, సర్పంచులు డిమాండ్ చేశారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శుక్రవారం ఎంపిపి గొర్లి సూరిబాబు అధ్యక్షతన సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు సభ్యులు మైన్స్ శాఖపై ధ్వజమెత్తారు. మండలంలో అనధికారికంగా కొనసాగుతున్న క్వారీలపై తీసుకున్న చర్యలను ప్రశ్నించారు. సుమారు 30 కోట్ల రూపాయలు డిఎంఎఫ్ నిధులు మండలానికి రావలసి ఉండగా ఒక్క రూపాయి విడుదల చేయలేదని ధ్వజమెత్తారు. మండలంలో 148 క్వారీలు, సుమారు 90 క్రషర్లు ఉండగా వాటిలో 50 క్వారీలకు మాత్రమే అనుమతులు ఉన్నట్లు మైన్స్ శాఖ ఆర్ఐ శ్రీనివాసరావు తెలిపారు. అనాథరైజ్డ్ బ్లాస్టింగ్, ఓవర్ లోడింగ్ వాహనాలపై ఆర్టీవో అధికారులు, పోలీసులు, మైన్స్ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. క్వారీ క్రషర్ల యజమానులు ఇచ్చిన హామీలు అమలు చేయలేదని, వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తుఫాను వల్ల వరి పంట దెబ్బతిందని, రంగు మారిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని కోరారు. సమావేశంలో జెడ్పి వైస్ చైర్పర్సన్ బీవీ సత్యవతి, డిఈ వేణుగోపాల్, ఎంపీడీవో కే నరసింహారావు, ఈవోపిఆర్డి ప్రసాద్, పంచాయతీరాజ్ ఎఈ బాలాజీ అప్పారావు, వైస్ ఎంపీపీ అయిత ఆనంద రామ్, పలువురు ఎంపిటిసిలు, సర్పంచులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విఆర్ఒలకు డైరీలు, కేలండర్ల పంపిణీ

ప్రజాశక్తి-కె.కోటపాడు : ఎపి విలేజ్ రెవెన్యూ ఆఫీసర్స్ అసోసియేషన్ అనకాపల్లి జిల్లా కమిటీ 2025వ సంవత్సరం కేలండర్లు డైరీలను శుక్రవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో విఆర్ఒలకు అసోసియేషన్ నాయకులు పంపిణీ చేశారు. అనంతరం ఇటీవల డిప్యూటీ కలెక్టర్గా పదోన్నతి పొందిన తహసీల్దార్ పి.భాగ్యవతిని సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు ఈర్లె శ్రీరామ్మూర్తి, జిల్లా అధ్యక్షుడు ఎస్టి.రామకాసు, ప్రధాన కార్యదర్శి ఎన్.అనంతరామయ్య, జిల్లా ఉపాధ్యక్షుడు పూడి సురేష్, అనకాపల్లి డివిజన్ అధ్యక్షుడు గణేష్, జిల్లా కోశాధికారి కె.గౌరీశంకర్, విఆర్వోలు జ్యోతి, విజయశ్రీ, శివ, గంగునాయుడు, వెంకటేష్, నాయుడు, జగదీష్, సూర్యనారాయణ పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి-మునగపాక : దీర్ఘకాలిక రోగాల పట్ల ప్రతి ఒక్కరు అప్రమత్తంగా ఉండాలని మూలపేట సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు అన్నారు. మండలంలోని మూలపేట గ్రామంలో శుక్రవారం జరిగిన 104 సేవలను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో పంచాయితీ కార్యదర్శి మొల్లేటి గంగాధర్, ఏఎన్ఎం రమణి, యామిని, ఆశ వర్కర్లు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

రామ్కో యాజమాన్య అక్రమాలపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని ఎన్.పేటలో గల రామ్కో సిమెంట్ కర్మగారం యాజమాన్యం అక్రమాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్కు ఫిర్యాదు చేసినట్లు గొబ్బూరు గ్రామానికి చెందిన బుద్ద వెంకట రమణ తెలిపారు. గ్రామంలోని కిత్తియ్య చెరువు కొంత ఆక్రమణ చేశారని, చెరువులకు మామిడి వాక గెడ్డ నుండి వచ్చు కాలువలు, చెరువులో బ్రిడ్జి నిర్మాణం చేపట్టారని, దీనికి పంచాయతీ ఎన్ఓసి కూడా లేదని పేర్కొన్నారు. ఈ ఫిర్యాదును అనకాపల్లి ఆర్డిఓ, కశింకోట తహశీల్దారు, గొబ్బూరు కార్యదర్శికి పంపినట్లు చెప్పారు.

మంచినీటిలో సోడియం క్లోరైడ్ శాతం పరిశీలన

ప్రజాశక్తి-యలమంచిలి : మున్సిపాలిటీ కుళాయిల ద్వారా ప్రజలకు సరఫరా అవుతున్న మంచినీటిలో క్లోరినేషన్ పాలు ఏ విధంగా ఉందో తెలుసుకొనేందుకు శుక్రవారం ఉదయం తులసీనగర్ 6వ వార్డులో గర్ల్స్ హైస్కూలు రోడ్డు కుళాయిల వద్ద కమిషనర్ ప్రసాదరాజు సమక్షంలో టెస్టింగ్ మిషిన్ ద్వారా పరిశీలించారు. అక్కడ సరఫరా అవుతున్న మంచినీటిలో టెస్ట్ రిజల్ట్ ప్రకారం 1.0 పిపిఎం (పార్ట్స్ పెర్ మిలియన్) ఉన్నట్లు తేలింది. ప్రజలకు సరఫరా అవుతున్న మంచినీటిలో 2.0 నుండి 0.2 వరకు ఉండవచ్చు. క్లోరినేట్ అవుతున్న సంపు దగ్గరలోని కుళాయిల్లో 2.0 వరకు ఉంటుందని, సరఫరా పైపు దూరం పెరిగే దాన్ని బట్టి చివరికొళాయిలో నీటిలో 0.2 పిపిఎం ఉండవచ్చునని మున్సిపల్ ఏఈ సుబ్బారావు తెలిపారు.

స్వచ్ఛ ఆంధ్రను విజయవంతం చేయండి

జిల్లా జాయింట్ కలెక్టర్ జాహ్నవి

ప్రజాశక్తి-అనకాపల్లి

అందరి భాగస్వామ్యంతో స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమం విజయవంతం చేయాలని జాయింటు కలెక్టరు ఎం. జాహ్నవి అన్నారు. శనివారం నిర్వహించే స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివాస్ కార్యక్రమంపై సంబంధిత అధికారులతో జాయింటు కలెక్టర్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో నెలలో ఒక శనివారం "స్వచ్ఛత" కోసం అంకితం కావాలని రాష్ట్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం చేపట్టినట్లు చెప్పారు. ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో విజయవంతంగా నిర్వహించాలని కోరారు. పంచాయితీరాజ్-గ్రామీణాభివృద్ధి శాఖ, పురపాలక - పట్టణాభివృద్ధి శాఖలు కీలక భూమిక పోషించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంపై ప్రజల్లో పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలన్నారు. ప్రతి అంశాన్ని యాప్లో అప్ లోడ్ చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని కార్యాలయాలు, పాఠశాలలు, ఆసుపత్రుల పరిసరాలను, గ్రామాలలో అపరిశుభ్ర ప్రదేశాలను శుభ్రం చేయాలని, చెత్త కుప్పల తొలగింపు, తాగు నీటి వసతుల క్లోరినేషన్, మురుగు కాలువలు శుభ్రం చేయడం, చెరువుల వద్ద చెత్త లేకుండా చూడటం, సామాజిక మరుగుదొడ్లను ఉపయోగంలోకి తీసుకురావడం, వ్యక్తిగత మరుగుదొడ్లు ఉపయోగించేలా అవగాహన కల్పించడం, ఇంటింటా తడిచెత్త - పొడిచెత్త ప్రక్రియ కొనసాగించడం వంటి కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ఈ వీడియో కాన్ఫరెన్స్లో జెడ్పి సిఈఒ పి.నారాయణమూర్తి, జిల్లా పంచాయతీ రిసోర్స్ సెంటరు జిల్లా కో ఆర్డినేటరు ఇ.నాగలక్ష్మి, జిల్లా పంచాయతీ అధికారి ఆర్.శిరీషా రాణి, నియోజక వర్గాల, మండలాల ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు పాల్గొన్నారు.

కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-చోడవరం

కార్మికుల సమస్యల పరిష్కారానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తానని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్ రాజు అన్నారు. తమకు బకాయి జీతాలు చెల్లించాలని కోరుతూ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులు విధులను బహిష్కరించి ఆందోళన చేస్తున్న నేపథ్యంలో ఎమ్మెల్యే రాజు శుక్రవారం ఫ్యాక్టరీ ప్రాంగణంలో ఉన్న వెంకటేశ్వర ఆలయంలో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీ కష్టాల్లో ఉందని, యూనియన్లు బేషజాలకు పోకుండా ఫ్యాక్టరీ అభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఫ్యాక్టరీని ఆర్థికంగా గట్టు ఎక్కించే బాధ్యత తనపై ఉందని, కార్మికుల జీతాల చెల్లింపులు కోసం నిధులు సమీకరణకు ఇప్పటికే ప్రయత్నాలు ప్రారంభించామని చెప్పారు. కార్మిక నాయకులు కె.భాస్కరరావు, ఎస్.రామునాయుడు మాట్లాడుతూ కాంట్రాక్టు, ఎన్ఎంఆర్ ఒకటి కార్మికులను రెగ్యులర్ చేయాలని, 365 రోజులు కార్మికులకు పని ఉండేలా చూడాలని, నెలనెలా జీతాలు చెల్లించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్డి వి.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే రాజుకు వినతిపత్రం ఇస్తున్న సిఐటియు నేతలు

బకాయి జీతాలు చెల్లించాలని సిఐటియు వినతి

గోవాడ సుగర్ ఫ్యాక్టరీ కార్మికులకు బకాయి పడ్డ వేతనాలు చెల్లించాలని స్థానిక ఎమ్మెల్యే కెఎస్ఎన్ఎస్.రాజు, ఎమ్డి వి.సన్యాసినాయుడుకు సిఐటియు నాయకులు శుక్రవారం వినతి పత్రాన్ని అందించారు. కార్మికులకు ఆరు కోట్ల రూపాయలు బకాయిలు ఉన్నాయని, కనీసం ఒక కోటి రూపాయలైనా పండగ ముందు చెల్లించాలని యాజమాన్యానికి విజ్ఞప్తి చేసిన పట్టించుకోకపోవడంతో సమ్మె చేస్తున్నారని తెలిపారు. కార్మికులకు తక్షణమే జీతాలు చెల్లించి వేగవంతంగా క్రషింగ్ ప్రారంభించాలని కోరారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ప్రేమ చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి గూనూరు వరలక్ష్మి, ఎస్వి నాయుడు తదితరులున్నారు.

ప్రభుత్వ విధానాలతో

వ్యవసాయ, పాడి పరిశ్రమలకు తీవ్ర నష్టం



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న కార్మిక కర్షక వ్యతిరేక విధానాలతో వ్యవసాయ పాడి పరిశ్రమలకు తీవ్ర నష్టం వాటిల్లుతోందని, తద్వారా వాటిపై ఆధారపడిన రైతులు నష్టపోతున్నారని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్.శంకర్రావు అన్నారు. స్థానిక సిఐటియు కార్యాలయంలో శుక్రవారం జిల్లా గోపాల మిత్రల సంఘ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం కార్మిక చట్టాన్ని నిర్వీర్యం చేసిందన్నారు. రానున్న కాలంలో ఈ ప్రభుత్వ విధానాల వలన వ్యవసాయం తగ్గుముఖం పట్టే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విజన్ ప్రకారం 2047 నాటికి భూములు కార్పొరేట్ల గుప్పెట్లోకి వెళ్లాయని, తిరిగి కార్పొరేట్ సంస్థలు భూములను రైతాంగానికి కౌలుకు ఇచ్చి వారు చెప్పిన పంటలు వేసే విధానం వస్తుందని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రైతులు, పాడి రైతులు సంఘాలుగా ఏర్పడి ఐక్యంగా పోరాటాలు చేయాలని కోరారు.

గోపాలమిత్ర సంఘం కార్యవర్గం ఎన్నిక

గోపాలమిత్ర సంఘం సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా గౌరవ అధ్యక్షులుగా సిఐటియు జిల్లా అధ్యక్షులు శంకర్రావును, జిల్లా అధ్యక్షులుగా ఆర్డీఎస్ అప్పారావు, సెక్రటరీగా రూపల పెద్ది నాయుడు ఎన్నికయ్యారు.

సామాజిక బాధ్యతగా అక్షరాస్యత కార్యక్రమం చేపట్టాలి

ప్రజాశక్తి-సబ్బవరం : ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమాన్ని సామాజిక బాధ్యతగా భావించి మహిళా సమాఖ్యలలో గుర్తించబడిన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దాలని అనకాపల్లి జిల్లా డిఆర్డిఏ పిడి కె.శచీదేవి పిలుపునిచ్చారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఉల్లాస్ అక్షరాస్యత కార్యక్రమంపై జిల్లా స్థాయిలో వయోజన విద్యాశాఖ వారి ఆధ్వర్యంలో జిల్లాలోని అందరూ ఎంపిడీవోలు, వెలుగు ఏపిఎంలకు ఒక్కరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ శిక్షణకు విచ్చేసిన టిసిఎస్ రాష్ట్ర ఇన్ఛార్జి విశ్వనాథ శ్రీనివాస్ మాట్లాడుతూ అక్షరాస్యత కార్యక్రమాల్లో సాంకేతిక పరిజ్ఞానం అవసరాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో జిఎస్డబ్ల్యూఎస్ నోడల్ అధికారి ఎస్. మంజులవాణి, వయోజన విద్య జిల్లా నోడల్ ఆఫీసర్ డి.చిన్నకృష్ణ, రిసోర్స్ పర్సన్ కె.శ్రీనివాస్ పాల్గొన్నారు.

గ్రామాల్లో ఘనంగా తీర్థ మహోత్సవాలు

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని నాగయ్యపేట, వేచలం, వాకపల్లి, ఎ.కొత్తపల్లి గ్రామాలలో శుక్రవారం గ్రామ దేవతల తీర్థ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆయా గ్రామాల్లో గ్రామ దేవతల ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగయ్యపేటలో గండి మారమ్మ తల్లి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు చిటిమిరెడ్డి సూర్యనారాయణ, సర్పంచ్ కర్రి పుష్ప, దేముడు నాయుడు, కర్రి నాయుడు, పెద్దడ వెంకటరమణ, రెడ్డి బలరాం, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అంతకాపల్లి పంచాయతీ శివారు రావులమ్మపాలెంలో శ్రీడొంకమాంబ పేరంటాలు తీర్థ మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సర్పంచ్ సబ్బవరపు నారాయణమూర్తి, వైస్ ఎంపిపి-2 చొక్కాకుల గోవింద్, మాజీ ఎంపిపి సబ్బవరపు ముత్యాలనాయుడు, గ్రామ పెద్దలు, భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోలాటాలు, స్వామి గరిడీలు, చిటికెలు భజనలు, మందుగుండు సామగ్రి, తీన్మార్ డబ్బులతో వైభంగా నిర్వహించారు. డాన్స్ బేబీ డాన్స్ సాంస్కృతిక కార్యక్రమం పలువురిని ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు సబ్బవరపు దేముడుబాబు, సబ్బవరపు నరసింహమూర్తి, సబ్బవరపు శ్రీనివాసరావు, గొంప ముత్యాల నాయుడు, సబ్బవరపు చిన్నంనాయుడు, మేడపురెడ్డి జగన్నాథం, బర్ల బాబి, సబ్బవరపు కృష్ణ, ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

19న కనకమహాలక్ష్మి అమ్మవారి తీర్థం

ప్రజాశక్తి-యలమంచిలి : యలమంచిలి మున్సిపాలిటీ ధర్మవరం వీధిలో ఉన్న శ్రీకనకమహాలక్ష్మి అమ్మవారి వార్షిక తీర్థ మహోత్సవం ఈ నెల 19న ఆదివారం నిర్వహించడానికి ఆలయ కమిటీ నిర్ణయించిందని చైర్మన్ కొఠారు సాంబశివరావు శుక్రవారం విలేకర్లకు తెలిపారు. ఉత్సవ ఏర్పాట్లన్నీ దాదాపు పూర్తయినట్లు చెప్పారు. తప్పెట గుళ్ళు, కోలాటం, నేల వేషాలు వంటి సంప్రదాయ సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివారం ఉదయం భక్తులు కుంకుమ పూజలు నిర్వహించడానికి, క్యూలైన్ల కోసం బారికేడ్లు నిర్మించడం పూర్తయిందన్నారు. భక్తులకు మంచినీరు, మజ్జిగ, ప్రసాదం ఏర్పాటు చేస్తున్నామన్నారు. డిగ్రీ కాలేజీ రాజీవ్ క్రీడా మైదానంలో తీర్థ మహోత్సవం జరుగుతుందన్నారు. డాన్స్ బేబీ డాన్స్ రెండు చోట్ల, సత్యహరిశ్చంద్ర నాటకం అమ్మవారి గుడి ప్రాంగణంలోనూ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ సభ్యులు కొఠారు కొండబాబు, మడగల సత్యనారాయణ, పిళ్లా రాము, కె.సూర్యప్రకాశ్, తేటకలి నాగేశ్వరరావు, కె.నరేష్ పాల్గొన్నారు.

ఆయుర్వేద వైద్యాధికారిగా గ్రీష్మ బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి-దేవరాపల్లి : స్థానిక ప్రభుత్వ ఆయుర్వేద ఆసుపత్రి వైద్యాధికారిగా డాక్టర్ జి.గ్రీష్మ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని రకాల వ్యాధులకు ఆయుర్వేద మందులు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఆమె వెంట కె.కోటపాడు హోమియోపతి డాక్టర్ సుమన్ లత ఉన్నారు.

రమేష్కు సన్మానం

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని అచ్చర్ల గ్రామంలో శ్రీసీతారాముల తీర్థ మహోత్సవం సందర్భంగా గురువారం రాత్రి అనకాపల్లి ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ ఉల్లింగల రమేష్ను కూటమి నాయకులు నిమ్మదాల సన్యాసినాయుడు, టిడిపి గ్రామ అధ్యక్షులు నైనంశెట్టి రమణారావు సాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో దొడ్డి నాగేశ్వరరావు, నిమ్మదాల బుల్లిబాబు, నిమ్మదాల రమేష్, నిమ్మదాల గోవింద, తర్పా నాగేశ్వరరావు, జాన్ పాల్గొన్నారు.

జీడి పిక్కలకు మద్దతు ధర చెల్లించాలి

- సిపిఎం, ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో పాదయాత్ర

ప్రజాశక్తి -కొత్తకోట:జీడీ పిక్కలకు మద్దతు ధర చెల్లించి ప్రభుత్వ మే కొనుగోలు చేయాలని, ఆర్ వో ఎఫ్ ఆర్ పట్టా కలిగిన జీడి మామిడి తోటలకు. బ్యాంకు రుణాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం, గిరిజన సంఘం ఆధ్వర్యం లో శుక్రవారం నేరేడు బంద నుండి అజయ్ పురం వరకు సుమారు ఐదు కిలోమీటర్లు పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యవర్గ సభ్యులు కె. గోవిందరావు మాట్లాడుతూ, గిరిజనుల నుంచి కొనుగోలు చేసే జీడి పిక్కలకు మద్దతు ధర ప్రకటించి, రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేయాలని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించాలన్నారు. ప్రతి ఏడాది జీడీ పంటకు గిట్టుబాటు ధర లేక రైతులు దళారీల చేతిలో దోపిడీకి గురై తీవ్రంగా నష్ట పోతున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి ఏటా వాణిజ్య పంటలకు మద్దతు ధరలు ప్రకటిస్తుంటాయని, జీడి పంటకు మాత్రం మద్దతు ధర ప్రకటించ లేదన్నారు.దీనిని అవకాశంగా తీసుకొని ప్రవేటు వ్యాపారులు తమకు ఇష్టం వచ్చిన ధరకు రైతుల వద్ద కొనుగోలు చేస్తున్నారని తెలిపారు. జీడి పిక్కలకు ధర నిర్ణయంలో ఎటువంటి శాస్త్రీయత, పారదర్శకత లేదన్నారు. జీడీ పిక్కలు 80 కేజీల బస్తా వ్యాపారులు రూ 7 వేలు మించి కోనుగోలు చేయడం లేదన్నారు. ఒక బస్తా జీడి పిక్కల నుండి 25 కేజీల పప్పు దిగుబడి వస్తోందని కేజీ పప్పు ధర రూ 800 రూపాయలు అంటే ఒక బస్తా పిక్కలు వల్ల రూ 20 వేల రాబడి ఉందన్నారు. ఒక బస్తా పిక్కలు ప్రోసెసిడిం గ్ కి రూ 2 వేలు ఖర్చు అవుతుందని రైతు లు కోరిన విధంగా బస్తా జీడిపిక్కల మద్దతు ధర రూ.16 వేలు చెల్లించినా ఇంకా వ్యాపారులకు రూ 2వేలు మిగులు తుందన్నారు. జీడి తొక్క, నూక ఇతర ఉప ఉత్పత్తుల నుంచి కూడా వ్యాపారులు ఆదాయం పొందుతున్నారని చెప్పారు. ప్రభుత్వమే జీడి పంటకు గిట్టుబాటు ధర నిర్ణయించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేసారు.జీడి పిక్కలు 80 కేజీల బస్తాకు 16 వేల గిట్టుబాటు ధర ప్రకటించి ఆర్బికేల ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలని, జీడి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, రాయితీలు పునరు ద్ధరించాలని డిమాండ్ చేశారు.జీడి పరిశోధనా కేంద్రాలు ప్రాంతాల వారీగా ఏర్పాటు చేసి అభివృద్ధి చేసిన నాణ్యమైన మొక్కలు రైతులకు అందించాలని, స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం బ్యాంకుల ద్వారా పంట రుణాలు అందించాలన్నారు.డిమాండ్లు పరిష్కరించాలని లేదంటే దశలవారీగా జిల్లా వ్యాప్తంగా ఆందోళన చేస్తామని గోవిందరావు, వంతల చిరంజీవి, కిలో పొట్టి దొర తదితరులు స్పష్టం చేశారు. అనంతరం పలు నినాదాలతో పాదయాత్ర చేశారు..



పాదయాత్ర చేపడుతున్న సిపిఎం నేతలు, గిరిజనులు



సత్కరిస్తున్న నాయకులు

అలరించిన సామ్రాట్ విజయ్ నాటకం

ప్రజాశక్తి-ఎస్.రాయవరం: మండలంలో పెట్టుగోళ్ళపల్లిలో గురువారం రాత్రి ప్రదర్శించిన సామ్రాట్ విజయ్ సాంఘిక నాటకం ప్రేక్షకులను అలరించింది.శ్రీ రాధాకృష్ణ యువజన కళా నాట్యమండలి సభ్యులచే ద్విశత నాటక దర్శకులు కొప్పిశెట్టి సత్యశ్రీనువాసరావు దర్శకత్వంలో సినీ సెట్టింగులతో ప్రదర్శించారు. గ్రామ సర్పంచ్ అల్లు నర్సింహమూర్తి, ఎంపిటిసి చప్పా రాజుల నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో నటీనటులు ప్రదర్శించిన నృత్యాలు ప్రేక్షకులను ఉర్రూతలూగించాయి. యస్ఆర్ మీడియా వైష్ణో శ్రీనివాస్ నాటకానికి వేసిన భారీ సెట్టింగులు చూపరులను ఆకట్టుకున్నాయి. అనంతరం కళాకారులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కురందాసు నూకరాజు, కోన అప్పలరాజు, అప్పలరాజు మాష్టారు వైస్ ప్రెసిడెంట్ కొప్పిశెట్టి రామకష్ణ తదితరులు పాల్గొన్నారు.

పశు ఆరోగ్య శిబిరాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: ఈ నెల 20 వ తేదీ నుండి 31 వ తేదీ వరకు ఏర్పాటు చేసే పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలని పశు వైద్యశాల సహాయ సంచాలకులు రాంబాబు కోరారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పశోత్పత్తి పెంపకమే ధ్యేయగా పాడి రైతులకు అండగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం పిలుపు మేరకు ఏర్పాటు చేసిన పశు ఆరోగ్య శిబిరాలను పాడి రైతులు వినియోగించుకోవాలన్నారు. నర్సీపట్నం, గొలుగొండ మండలాలలోని అన్ని గ్రామాలలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరాలలో పశువులకు, దూడ పెయ్యలకు, గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులు అందిస్తామనిన్నారు. టీకాలు వేస్తామన్నారు. గర్భకోశ వ్యాధులున్న పశువులకు ఉచితంగా చికిత్సలు నిర్వహిస్తామన్నారు.

విద్యుత్ దీపాలు ఏర్పాటు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని ఏఎల్.పురం మేజర్ పంచాయతీ జగనన్న కాలనీలో సర్పంచ్ లోచల సుజాత ఆధ్వర్యంలో వీధి దీపాలను ఏర్పాటు చేశారు. కాలనీ వాసులు మాట్లాడుతూ, ఇన్నాళ్లు వీధి దీపాలు లేక చాలా ఇబ్బంది పడేవారమని, ఈ విషయాన్ని స్థానిక సర్పంచ్ దృష్టికి తీసుకొని వెళ్ళగానే వెంటనే స్పందించి వీధి దీపాలు ఏర్పాటు చేయడంపై కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ మామిడి కృష్ణ, వైస్ సర్పంచ్ కుండల కొండతల్లి, పెదబాబులు పాల్గొన్నారు.



ఏర్పాటు చేస్తున్న లైటు



మాట్లాడుతున్న తహశీల్దార్

రీ సర్వే సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి -కోటవురట్ల:కూటమి ప్రభుత్వంలో నిర్వహించిన రీ సర్వే రెవెన్యూ సదస్సులలో వచ్చిన ఫిర్యాదులు త్వరితగతిన పరిష్కరించాలని తహసిల్దారు తిరుమలబాబు సూచించారు. శుక్రవారం రెవెన్యూ సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. అందిన ప్రతి ఫిర్యాదును పీజీఆర్ఎస్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నట్లు తెలిపారు. నిర్దేశించిన గడువులో పరిష్కారం చూపాలని సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి ఉంటుందని హెచ్చరించారు, రెవెన్యూ అధికారులు కార్యాలయాలకు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిష్కార మార్గాలు ఫిర్యాదుదారులకు చూపాలన్నారు, ప్రభుత్వ భూములు, అసైన్డ్, అనాధీనం భూములు అన్యాక్రాంతం కాకుండా సిబ్బంది నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనంతరం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, మలివిడత రీ సర్వే లో భాగంగా చిన్న బొడ్డేపల్లి గ్రామాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసామని తెలిపారు. గతంలో జరిగిన తప్పిదాలను పునరావృత్తం కాకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డిటి రమేష్, మండల సర్వేయర్ శ్రీనివాస్, ఆర్ఐ ఓర్ధవరావు, సీనియర్ అసిస్టెంట్ కృష్ణ, గ్రామ రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ఆసుపత్రి సిబ్బంది పనితీరుపై బండారు ఆగ్రహం

ప్రజాశక్తి- మాడుగుల : స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది వ్యవహరిస్తున్న పనితీరుపై ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో పాల్గొన్న ఆయన ఆసుపత్రి పనితీరుపై సూపరింటెండెంట్ బి చంద్రశేఖర్ను ప్రశ్నించారు. ఆసుపత్రిలో సిబ్బంది వైద్యులు పనితీరు బాగుండలేదని ప్రజల నుండి ఆరోపణ వస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తూ పద్ధతి మార్చుకోవాలని హెచ్చరించారు. ఆసుపత్రికి దంత వైద్యులు అవసరం ఉందని సూపరింటెం డెంట్ ఎమ్మెల్యే బండారుకు తెలిపారు. ఈ సమావేశానికి శానిటేషన్ కాంట్రాక్టర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. వెంటనే వేరే కాంట్రాక్టర్ను నియమించాలని ఆదేశించారు. ఆసుపత్రిలో డెలివరీలు ఎలా జరుగుతున్నాయని హెడ్ నర్స్ ప్రసన్నను అడిగారు. డెలివరీలను ఇంకా పెంచాలని సూచించారు. ఏడాది కాలంగా ఎక్సరె ప్లాంట్ పని చేయలేదని, డెలివరీ టేబుల్, స్టాండ్స్, హాట్ వాటర్ గీజర్ వంటి పరికరాలను అభివృద్ధి కమిటీ నిధులతో కొనుగోలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అద్దేపల్లి జగ్గారావు, పుప్పాల అప్పలరాజు, ఎంపీపీ రాజారామ్, ఎంపీడీవో కొంకి అప్పారావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే బండారు

జనసేన పార్టీకి గుర్తింపు ఏదీ?

సమావేశానికి పిలవకపోవడంపై నేతల ఆందోళన

ప్రజాశక్తి -మాడుగుల: కూటమి ప్రభుత్వం గెలుపునకు కృషి చేసిన తమకు సరైన ప్రాధాన్యత లభించలేదని జనసేన కార్యకర్తలు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం మాడుగుల ప్రభుత్వ ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశానికి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి హాజరు కాగా జనసేన పార్టీకి చెందిన నాయకులకు ఎటువంటి సమాచారం అందించలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆసుపత్రి అభివృద్ధి కమిటీలో జనసేనకు స్థానం ఇవ్వలేదని, పార్టీకి మొదటి నుండి కష్టపడి పని చేస్తున్నామని వాపోయారు. తమకు తగిన ప్రాధాన్యత ఇవ్వడం లేదన్నారు. ఇటువంటి సమస్యలు పునరావృతం అవకుండా చూడాలని వారు కోరారు.



ఆవేదన వ్యక్తం చేస్తున్న జనసేన నాయకులు



వినతిపత్రాన్ని ఇస్తున్న స్థానికులు

డ్రెయినేజీ ఆక్రమణలపై ఫిర్యాదు

ప్రజాశక్తి-రోలుగుంట:రోలుగుంట పంచాయితీ పరిధి కొట్టే వారి వీధిలో డ్రైనేజీ ఆక్రమణపై ఈ ప్రాంతానికి చెందిన కొట్టే సంజీవరావు, కొట్టే పైడినాయుడు, మజ్జి రమణ తదితరులు శుక్రవారం పంచాయతీ కార్యదర్శి రాజశేఖర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, డ్రైనేజికి అడ్డంగా సిమెంట్ గట్టు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ విషయంపై గతంలో జిల్లా కలెక్టర్‌కు కూడా వినతి పత్రం ఇచ్చామని, అయినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని కోరారు.

కల్వర్టు నిర్మాణం

ప్రజాశక్తి-రోలుగుంట: మండలంలోని వి.శరభవరంనకు ఆనుకొని పెద్ద గెడ్డ కట్టుకు కల్వర్టు నిర్మాణానికి ఇటీవల చోడవరం ఎమ్మెల్యే కేఎస్ఎన్ఎస్.రాజు నిధులు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించినట్లు స్థానిక నాయకులు పంచాడ చంద్ర తెలిపారు. పెద్దకట్టు గెడ్డ వద్ద కల్వర్టు శిధిలావస్థకు చేరడంతో వాహనదారులు ఇబ్బంది పడేవారు. ఉపాధి హామీ పథకంలో 10లక్షలు మంజూరు చేయడంతో పనులు ప్రారంభించి పక్క నుండి రహదారి ఏర్పాటు చేశారు. దీంతో శరభవరం నుండి వడ్డిప మీదుగా ప్రయాణం చేసేవారంతా హర్షం వ్యక్తం చేస్తున్నారు.



ఏర్పాటు చేసిన కల్వర్టు

కిరాణా షాపుల్లో తనిఖీలు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ మండలం జోగంపేటలో పలు కిరాణా షాపులను తూనికలు కొలతల శాఖ అధికారి అనురాధ శుక్రవారంతనిఖీ చేశారు. ఈ సందర్భంగా అధికారుల రాకను గ్రహించిన వ్యాపారస్తులు షాపులు మూసివేశారు. గత నెలలో బిజెపి నాయకులు గాదె శ్రీనివాసరావు జోగుంపేట కిరాణా షాపులో ఉప్పు ప్యాకెట్ కొనుగోలు చేయగా కేజీ ఉండవలసిన ప్యాకెట్ 750 గ్రాముల ఉండడంతో అయన వినియోగదారుల సంస్థకు, తూనికల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు స్పందించిన అధికారులుషాపులో తనిఖీలు చేపట్టారు.



పరిశీలిస్తున్న అనురాధ

శ్రీకృష్ణదేవరాయలకు ఘన నివాళి

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మున్సిపాలిటీ అయ్యన్న కాలనీలో కళ్యాణ మండపం వద్ద శుక్రవారం శ్రీకృష్ణదేవరాయ కళ్యాణ మండపం కమిటీ సభ్యులు శ్రీకృష్ణదేవరాయల జయంతి వేడుకలను నిర్వహించారు. ముందుగా శ్రీకృష్ణదేవ రాయలు విగ్రహానికి పూలమాల వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా కమిటీ సభ్యులు మాట్లాడుతూ ప్రజల సహకారంతో కళ్యాణ మండపం నిర్మాణం చేపట్టడం జరిగిందని, స్థానికులు ఇక్కడ శుభకార్యాలు జరుపుకోవడం జరుగుతుందన్నారు. కళ్యాణ మండపం లో కొన్ని మౌలిక సదుపాయాలు సమకూర్చేందుకు స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు దృష్టికి తీసుకెళ్లడం జరిగిందని తెలిపారు. కళ్యాణ మండపం చుట్టు ఫెన్సింగ్ వేయటానికి రూ.4,50,000 మంజూరు చేసారని అన్నారు. ఈ కార్యక్రమంలో గొల్లవిల్లి రాము, కరణం ఈశ్వరరావు, గొల్లవిల్లి శివ, గాలి రమణ, కొడవటి గోపి, యర్రా దొరబాబు, రౌతు చిన్నయ్య, సుర్ల నాని పాల్గొన్నారు.



నివాళి అర్పిస్తున్న సభ్యులు



నర్సీపట్నంలో పరిశీలిస్తున్న అధికారులు

నవోదయ పరీక్షకు ఏర్పాట్లు పూర్తి

-చీఫ్ సూపరింటెండెంట్ నాగన్నదొర

ప్రజాశక్తి -నక్కపల్లి:నక్కపల్లి రెసిడెన్షియల్ స్కూల్ కేంద్రంగా ఆరవ తరగతిలో ప్రవేశాలకొరకు శనివారం నిర్వహించనున్న నవోదయ ప్రవేశ పరీక్షకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఛీఫ్ సూపరింటెండెంట్ నాగన్నదొర తెలియజేశారు. శుక్రవారం స్థానిక ఎంఈఓలు కె.నరేష్, వేమగిరి నూకరాజులతో కలిసి ఏర్పాట్లు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నక్కపల్లి కేంద్రంలో నవోదయ ఎంట్రన్స్ పరీక్షకు 240 మంది విద్యార్థులు హాజరు కానున్నారని తెలిపారు.శనివారం ఉదయం 11-30 నుండి 1-30 వరకు పరీక్ష జరుగుతుందని, పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు, ఇన్విజిలేటర్లు ఉదయం పది గంటలకే హాజరు కావాలన్నారు. పరీక్షాకేంద్రంలో ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు, మొబైల్ ఫోన్లుకు అనుమతి లేదన్నారు. తాగునీరు, విద్యుత్, వైద్యం వంటి సదుపాయాలు కల్పించినట్లు తెలిపారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. ప్రశాంతమైన వాతావరణంలో విద్యార్థులు పరీక్ష రాయడానికి అన్ని ఏర్పాట్లు చేశామన్నారు.

పరీక్షా కేంద్రాలను తనిఖీ

నర్సీపట్నం టౌన్ :నవోదయ పరీక్ష కేంద్రాలను అధికారుల పర్యవేక్షించారు. శనివారం జరగబోయే నవోదయ పరీక్ష కేంద్రాలను శుక్రవారం విద్యుత్ శాఖ డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ త్రినాథరావు, హౌసింగ్ డిఈ ఫణి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేశారు. నర్సీపట్నంలో జిల్లా పరిషత్ మెయిన్ స్కూల్, ముస్లిం బడి, జిల్లా పరిషత్ బాలికల పాఠశాల, ప్రభుత్వ జిల్లా పరిషత్ పాఠశాల నాలుగు పరీక్ష కేంద్రాలలో నవోదయ ఎంట్రన్స్ పరీక్షలు జరగనున్నాయి ఈ పరీక్ష కేంద్రాల్లో సరఫరా అవుతున్న విద్యుత్, వైరింగ్ తదితర వాటిని పరిశీలించారు. పరీక్షలకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేస్తామని విద్యుత్ అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు పటిష్ట ఏర్పాట్లు

-జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: పోలీస్ పరేడ్ మైదానంలో ఈ నెల 26న జరిగే గణతంత్ర దినోత్సవ వేడుకలను విజయవంతంగా నిర్వహించేందుకు పటిష్ట ఏర్పాట్లు చేయాలని జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్ తెలిపారు. వేడుకల నిర్వహణ ఏర్పాట్లపై సమీక్షించే నిమిత్తం పోలీస్, రెవెన్యూ, ఇతర అధికారులతో కలిసి శుక్రవారం కలెక్టరేట్ మీటింగు హాలులో నిర్వహించిన సమన్వయ కమిటీ సమావేశంలో పలు అంశాలపై ఆయన దిశానిర్దేశం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రతిబింబిస్తూ శకటాలను తీర్చిదిద్దాలని, స్టాళ్లు ఏర్పాటు చేయాలని సూచించారు. జిల్లా స్థాయిలో ఇప్పటి వరకు చేపట్టిన అభివృద్ధి పనులను ప్రజలకు తెలియపరిచేలా చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలని చెప్పారు. మైదానం సిద్ధం చేయాలని, విఐపి, వివిఐపిలు సీటింగ్ ఏర్పాట్లు, సాధారణ పౌరులు వేడుకులను వీక్షించేందుకు అనువుగా గ్యాలరీలను ఏర్పాటు చేయాలని జెసి సూచించారు.సాంస్కృతిక కార్యక్రమాల ప్రదర్శన, గీతాలపన, ప్రగతి నివేదిక ఇతర అంశాల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులంతా సమన్వయంతో వ్యవహరించాలని పటిష్ట ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి బీహెచ్ భవానీ శంకర్, పోలీస్, రెవెన్యూ, ఇతర విభాగాల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఆదర్శమూర్తి.. జ్యోతిబసు

వర్ధంతి సభల్లో వక్తలు



విశాఖలో నివాళ్లర్పిస్తున్న కుమార్, తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎం తొలితరం నాయకులు, పశ్చిమ బెంగాల్ పూర్వ ముఖ్యమంత్రి జ్యోతిబసు ఆదర్శమూర్తి అని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్ కొనియాడారు. జ్యోతిబసు 15వ వర్ధంతి కార్యక్రమం సిఐటియు విశాఖ జిల్లా కార్యాలయంలో శుక్రవారం జరిగింది. తొలుత జ్యోతిబసు చిత్రపటానికి సీనియర్ నాయకులు వై.రాజు, కుమార్ పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా కుమార్ మాట్లాడుతూ దేశంలో మొట్టమొదటిగా రైల్వే కార్మికులకు యూనియన్ స్థాపించి వారి సమస్యల పరిష్కారానికి జ్యోతిబసు కృషి చేశారన్నారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో బ్రిటీష్ వారికి వ్యతిరేకంగా ఉద్యమిస్తూ బెంగాల్‌లో కార్మికవర్గాన్ని, రైతాంగాన్ని ఐక్యం చేసి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారన్నారు. సిపిఎం పొలిట్ బ్యూరో నవరత్నాల్లో జ్యోతిబసు ఒకరన్నారు.1977 బెంగాల్ శాసనసభ ఎన్నికల్లో సిపిఎం, ఇతర వామపక్ష పార్టీలు విజయం సాధించడంతో జ్యోతిబసు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 22 ఏళ్ల సుదీర్ఘ కాలంపాటు జన రంజక పాలన కొనసాగించారని చెప్పారు. ఆయన కాలంలో చేపట్టిన విధానాలతో దేశంలోనే నెంబర్ వన్ పరిపాలనాధక్షునిగా పేరొందారన్నారు. దేశంలో అనేక చోట్ల మతఘర్షణలు జరిగినప్పటికీ బెంగాల్‌లో ఒక మత ఘర్షణ లేకుండా ప్రజల ఐక్యతను నెలకొల్పారన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వి.కృష్ణారావు, టి.కామేశ్వరరావు, ఎం.ప్రదీప్, విఎన్.కుమార్, కె.కుమారి, కొండమ్మ, కెవిపి.చంద్రమౌళి, ఎం.సూరీడు, లక్ష్మీపతి, శివ, భారతి, గణేష్, కె.నరసింగరావు, పట్టాభి పాల్గొన్నారు.



ఆరిలోవలో...

అరిలోవ :సిపిఎం మొదటితరం నాయకులు, పశ్చిమబెంగాల్ పూర్వ ముఖ్యమంత్రి జ్యోతిబసు 15వ వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం బిఎన్ఆర్. నగర్ కాలనీలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించారు.

ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి.నరేంద్రకుమార్ జ్యోతిబస్ సేవలను కొనియాడారు. 1977 నుంచి 22ఏళ్లపాటు పశ్చిమబెంగాల్‌కు సుదీర్ఘకాలంపాటు ముఖ్యమంత్రిగా వ్యవహరించి, సామరస్యపూర్వక సుపరిపాలనను అందించారన్నారు. ఈ కార్యక్రమంలో రమణ, సూర్యనారాయణ, నాగరాజు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

గాజువాక : స్థానిక సిఐటియు కార్యాలయంలో ఆర్ నాగేశ్వరరావు అధ్యక్షతన జ్యోతిబస్ వర్ధంతి సభలో పిఎవైవి రమణారావు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సిపిఎం గాజువాక జోన్ కార్యదర్శి ఎం.రాంబాబు మాట్లాడుతూ, స్వచ్ఛందంగా వైదొలిగిపోయే వరకు ఐదు పర్యాయాలు పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రిగా జ్యోతిబస్ సేవలను కొనియాడారు. పార్టీ నాయకులు గొల్ల గాని అప్పారావు సింహాద్రి రాజు ఎస్ గణేష్ శ్రీను పాల్గొన్నారు.

మధురవాడ :.జ్యోతిబసు 24వ వర్ధంతి సందర్భంగా కొమ్మాది సిఐటియు కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి సిపిఎం నాయకులు సియాద్రి పైడితల్లి పూలమాల వేసి నివాళులు అర్పించారు. సిపిఎం జిల్లా నాయకులు డి అప్పలరాజు, రాజుకుమార్ మాట్లాడుతూ. అప్పటి ప్రతి పక్ష పార్టీలు ఎంత ఒత్తిడి చేసినా, తాను నమ్మిన సిద్ధాంతం కోసం, పార్టీ ఉమ్మడి నిర్ణయానికి కట్టుబడి తృణప్రాయంగా ప్రధాని పదవిని కాదన్న గొప్ప నాయకుడు జ్యోతిబసు అని కొనియాడారు. కార్యక్రమంలో వంద్రాసి సంధ్య, కె.కొండమ్మ, టి.రమేష్, సిహెచ్.శేషుబాబు పాల్గొన్నారు.



అనకాపల్లిలో..

అనకాపల్లి:భారతదేశ కమ్యూనిస్టు ఉద్యమనేత, పశ్చిమ బెంగాల్ మాజీ ముఖ్యమంత్రి కామ్రేడ్ జ్యోతిబసు 15వ వర్ధంతి స్థానిక సిపిఎం కార్యాలయంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గంటా శ్రీరామ్ అధ్యక్షతన జరిగిన వర్ధంతి సభలో ముందుగా పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు జ్యోతిబసు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శంకరరావు మాట్లాడుతూ పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రిగా వరుసగా 5 సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసి రికార్డు సృష్టించారని తెలిపారు. 1996లో దేశ ప్రధానమంత్రి అయ్యే అవకాశం వచ్చినా పార్టీ నిర్ణయమే శిరోధార్యమని భావించి ఆ పదవిని తిరస్కరించిన గొప్ప నేత జ్యోతిబసు అని కొనియాడారు. ఇంగ్లాండులో న్యాయశాస్త్రాన్ని అభ్యసించిన ఆయన ఆ కాలంలోనే కమ్యూనిస్టు పార్టీ వైపు ఆకర్షితుడై, ఉన్నతమైన అవకాశాలు వున్నా సమాజ సేవ కోసం కమ్యూనిస్టు ఉద్యమంలోకి వచ్చారని తెలిపారు. బెంగాల్‌లో రైల్వే, జ్యూట్ కార్మిక యూనియన్ల నిర్మాణంలోనూ కీలక భూమిక పోషించారని తెలిపారు. అనేక కార్మిక పోరాటాలకు ఆయన నాయకత్వం వహించారన్నారు. తన మరణాంతరం తన దేహాన్ని మెడికల్ కాలేజీ విద్యార్థుల పరిశోధనల నిమిత్తం అప్పగించారని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అడిగర్ల రాజు, నాయకులు కె.ఈశ్వరరావు, పి.శ్రీనివాసరావు, తేల్లయ్యబాబు, నూక అప్పారావు, మల్లికార్జునరావు తదితరులు పాల్గొన్నారు.



గాజువాకలో...

ఉచిత గ్యాస్‌కు అదనంగా డబ్బులు వసూలు చేస్తే చర్యలు

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్: రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీల అమలులో భాగంగా పేద కుటుంబానికి సంవత్సరానికి 3 గ్యాస్ సిలిండర్‌లు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్ పేర్కొన్నారు. దీపం-2 ఉచిత గ్యాస్ పథకం కింద సిలిండ్‌కు చెల్లించాల్సిన అసలు బిల్లుకు అదనంగా రూ.80 నుండి రూ.150 వరకు కొన్ని గ్యాస్ ఏజెన్సీలు వసూలు చేస్తున్నాయని ఫిర్యాదులు వస్తున్నాయన్నారు.లబ్ధిదారుల నుంచి వచ్చిన ఫిర్యాదులు రుజువయితే, సదరు గ్యాస్ ఏజెన్సీల పై తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అటువంటి ఏజెన్సీలను బ్లాక్ లిస్టులో పెట్టడం జరుగుతుందన్నారు. ఈ పథకం కింద ఏ ఒక్కరూ ఎటువంటి అదనంగా డబ్బు చెల్లించాల్సిన అవసరం లేదన్నారు. లబ్ధిదారుల నుండి గ్యాస్ ఏజెన్సీలు అదనంగా డబ్బులు వసూలు చేస్తే 0891-2590100, 0891-2590102 టోల్ ఫ్రీ నెంబర్లుకి కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ (పిజిఆర్ఎస్) ద్వారా కూడా ఫిర్యాదు చెయవచ్చన్నారు.

స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివస్‌ను విజయవంతం చేయాలి

-కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ప్రజాశక్తి-విశాఖ కలెక్టరేట్:దేశంలోనే అత్యంత పరిశుభ్ర రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించాలని, ఇందుకు తగిన కార్యాచరణ రూపొందించుకోవాలని జిల్లా కలెక్టర్ ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ ఆదేశించారు. ప్రతి నెలా మూడో శనివారం నిర్వహించే ఈ కార్యక్రమంలో జిల్లా యంత్రాంగం అంకితం కావాలని సూచించారు. జిల్లాలోని వివిధ విభాగాల జిల్లాస్థాయి అధికారులు, జోనల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు,ఇతర అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ హాలు నుంచి వర్చ్యువల్ గా సమీక్షా సమావేశం నిర్వహించారు.స్వచ్ఛ ఆంధ్ర,స్వచ్ఛ దివాస్ కార్యక్రమాన్ని విజయంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన పద్ధతులు, విధి విధానాలపై దిశా నిర్దేశం చేశారు. జిల్లా స్థాయి నుంచి గ్రామ స్థాయి అధికారుల వరకూ ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని పిలుపునిచ్చారు. జనవరి మాసంలో మూడో శనివారం నుంచి న్యూ ఇయర్ - క్లీన్ స్టార్ థీమ్ తో కార్యక్రమాన్ని ప్రారంభించనున్న నేపథ్యంలో ఉదయం అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో పరిశుభ్రతా చర్యలు చేపట్టాలని,గార్బేజ్ క్లీనింగ్, టాయిలెట్స్ క్లీనింగ్ చేయాలని పేర్కొన్నారు. పబ్లిక్ టాయిలెట్స్, బస్ స్టాప్స్ పరిశుభ్రం చేయాలన్నారు. .ప్రభుత్వ ఆసుపత్రులలో, పిహెచ్ సిలలో పరిశుభ్రత కార్యక్రమాలను పక్కాగా చేపట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. . ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ కె.మయూర్ అశోక్, జివిఎంసి కమిషనర్ పి.సంపత్ కుమార్, డీఆర్వో బిహెచ్. భవానీ శంకర్,జోనల్ కమిషనర్లు, ఎంపిడివోలు, తహశీల్దార్లు పాల్గొన్నారు.



ఏర్పాటు చేసిన విద్యుత్ స్తంభం

విద్యుత్ స్తంభాన్ని సరిచేసిన అధికారులు

-ప్రజాశక్తి కథనానికి స్పందన

ప్రజాశక్తి - చీడికాడ:ప్రమాద భరితంగా విద్యుత్ స్తంభం పేరుతో ప్రజాశక్తి ప్రముఖ దినపత్రికలో ప్రచురించిన కథనానికి విద్యుత్ శాఖ అధికారులు స్పందించారు. ప్రమాద భరితంగా ఉన్న స్తంభాన్ని సరిచేశారు. మండలంలో కొండల కొత్తూరు గిరిజన గ్రామంలో విద్యుత్ స్తంభం వాలిపోయి ఉండటంపై ప్రజాశక్తిలో ప్రచురితమైంది. స్పందించిన విద్యుత్ శాఖ అధికారులు వెంటనే విద్యుత్ స్తంభాన్ని సరి చేయడం జరిగిందని విద్యుత్ శాఖ ఏఈ తెలియజేశారు.